ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
మంగళవారం 3 సెప్టెంబరు 2024





కొల్లూరు: లంకల్లో మంచినీటి కోసం పడవ వద్దకు వరద నీటిలో వెళుతున్న యువకులు



కొల్లూరు: గాజుల్లంకలో నీట మునిగిన గృహాలు



భట్టిప్రోలు: వరద నీరు ముంచెత్తడంతో డాబాపైకి ఎక్కిన కుటుంబం

లంక గ్రామాలన్నీ.. జల దిగ్బంధం

బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు గుప్పిటపట్టి..

- చుట్టూ చిమ్మచీకటి... పాములతో సహజీవనం
- వరద నీటిలోనే లంక గ్రామవాసులు
- జ్వరాలతో పడకేసి... మందులులేక దిక్కు తోచక
- సాయం అందించాలన్నా కష్టమైపోయింది..

ఎటు చూసినా వరద నీరు. అంతా చిమ్మ చీకటి. అడుగు బయటకు పెట్టాలంటే భయం. పాములు, విష కీటకాలతోనే సహజీవనం. వీటన్నిటికీ తోడు వరదలకు ముందే గ్రామాలకు గ్రామాలు జ్వరాలతో మంచం పడితే, ఇప్పుడు వారికి వరద నీటిలో మందులు అందక, కొన్ని గ్రామాల్లో తాగటానికి గుక్కెడు నీరు దొరక్క, వారు పడుతున్న అవస్థలు వర్ణనాతీతమే. కృష్ణా నదీ వరద ముంపు లంక గ్రామాల్లో పరిస్థితి ఇదీ. రెండు రోజుల నుంచి వరద ముంచెత్తి, ఊళ్ళను చుట్టుముడితే అంతగా వరద ప్రభావం ఉండదని భరోసాతోఉన్న స్థానికులు చాలామంది పశువులను వదిలేసి, ఇళ్లనుంచి బయటకు రావటానికి ఇష్టపడలేదు. 2009 తర్వాత ఇంత భారీ స్థాయిలో కృష్ణా నదికి వరద వచ్చిందిలేదు. 2009లో తమ ఇళ్లు భద్రమని, మునగలేదు కనుక తమ ఇళ్లలోనే ఉండొచ్చని ధీమాగా ఉన్న వారంతా ఇప్పుడు భయపడిపోతున్నారు. ప్రకాశం బ్యారేజి నుంచి సోమవారం మద్యాహ్నం నుంచి కూడా 11.43 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు వస్తూనే ఉంది. ఎగువ బ్యారేజీల నుంచి వరద నీరు తగ్గినా, మునేరు, పాలేరు, కీసర, బుడమేరు వాగులు ఇంకా పొంగి ప్రవహిస్తూనే ఉండటంతో అధికారులు కూడా ఒక అంచనా వేయలేకపోయారు. వరద ప్రవాహ వేగం కూడా అంచనాలేకపోవటం, అరవింద వారధి దగ్గర చిన్నపాయ అడ్డుకట్ట తెగిపోవటంతో ఒకేసారి వరద నీరంతా ఊళ్లపై పడటంతో మరింత నష్టం ఏర్పడినట్టయింది. దీంతో వరద నీటి ప్రభావం సోమవారం భారీగా పెరగటంతో నీరు చేరని ఇల్లే లేదంటే అతిశయోక్తి కాదు.

తెనాలి, బాపట్ల, రేపల్లె, కొల్లూరు, కొల్లిపర సెప్టెంబరు 2, (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి దిగువన తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని లంక గ్రామాలన్నీ జలదిగ్బంధంలోనే చిక్కుకుపోయాయి. అయితే ఈ ప్రాంతాలకు పగలు కొద్దిసేపు, రాత్రి కొంత సమయం విద్యుత్తు సరఫరా ఇస్తుండటం, కొన్ని గ్రామాలకయితే రెండు రోజుల నుంచి విద్యుత్తు లేకపోవటంతో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. రాత్రయితే చుట్టూ చీకటి కమ్మేసి ఉండటం, అంతా నీరు నిండిపోవటంతో పొలాలపై, పొదల్లో ఉన్న విష సర్పాలు, కీటకాలు ఇళ్లలోకి చేరిపోతున్నాయని వారు ప్రాణ భయంతో చెబుతున్నారు. నీటిలో వాటిని ఏమీ చేయలేకపోతున్నామని, వాటితో కలసి సహజీవనం చేయటం మినహా చేసేదేమీలేకుండా ఉందనేది బాధితుల ఆవేదన. కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం కనిగిరిలంక వాసులను నది మధ్య నుంచి కొల్లూరు మండల కేంద్రానికి తరలించేందుకు పడవపై ప్రయత్నం చేస్తే అది చెట్టుకు ఢీకొని పెద్ద ప్రమాదమే తప్పింది. దీంతో అధికారులు కూడా వారిని ఇంతటి ప్రవాహ వేగం ఉన్న తరుణంలో బయటకు తీసుకురావటం ఇబ్బందిగా మారటంతో ఆహార పొట్లాలను లంక గ్రామాలకే పంపుతున్నారు. అయితే అవన్నీ కొన్ని గ్రామాలకు, కొన్ని ఇళ్లకే అందుతున్నాయని, మిగిలినవారు ఆకలితోనే అలమటించాల్సి వస్తోందని వాపోతున్నారు. కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం మొత్తం వరద ముంపులో చిక్కుకుపోయింది. అక్కడి నుంచి 50 మందికిపైగా స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే లోపల ఉన్న లంకల నుంచి బయటకు తీసుకురావటానికి అధికారులు భయపడాల్సిన పరిస్థితి. ఇటు కొల్లూరు మండలంలోనూ కరకట్టకు దగ్గర్లోఉన్న పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజుల్లంక, పోతార్లంక, జువ్వలపాలెం, కిష్కింధపాలెం, తిప్పలకట్ట, భట్టిప్రోలు మండలంలోని చింతమోటు, పెదలంక, పెసర్లంక, మరికొన్ని గ్రామాల వారినికూడా దరికి చేర్చలేని పరిస్థితి. వారికి అవసరమైన ఆహారం, తాగునీటి సరఫరాకే అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే ఆహార పొట్లాలు గ్రామాల్లో సచివాలయాల దగ్గర పెట్టేసి వెళ్లటం, కొన్ని పొట్లాలు ప్యాకింగ్ కూడా లేకుండా పంపటంతో తినటానికి పనికిరాకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార పొట్లాలు ఆలస్యం కావటం, పొట్లాలు సరిగాలేకపోవటంపై ఎమ్మెల్యే ఆనందబాబు అధికారులపై మండిపడ్డారు. మీకు కుదరదంటే కార్యకర్తలతో పంపుతానని, పనిచేయలేనివారు వెళ్లిపోవచ్చని సిబ్బందిని హెచ్చరించారు. అయితే వీటితోపాటు మందులు, వైద్య సిబ్బందిని కూడా గ్రామాలకు పంపగలిగితే బతుకుతామని, లేకుంటే వరద భయంతోపాటు, రోగాలతో చనిపోతామని వారు కన్నీరుమున్నీరవుతున్నారు.



భట్టిప్రోలు: వెల్లటూరు కరకట్ట వద్ద పడవల్లో లంక గ్రామాలకు నిత్యావసరాలను పంపిస్తున్న అధికారులు



రేపల్లె: మోర్తోటలోని ముక్తేశ్వరస్వామి ఆలయం చుట్టూ చేరిన వరదనీరు



కొల్లూరు: పల్లెపాలెం నుంచి గృహాలలోని వస్తువులను బోట్లు ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించుకుంటున్న ప్రజలు



కొల్లూరు: వరద ప్రభావిత ప్రాంతాలను మ్యాప్ ద్వారా మంత్రి గొట్టిపాటి, ఎంపీ తెన్నేటి, ఎమ్మెల్యే ఆనందబాబుకు వివరిస్తున్న కలెక్టర్



భట్టిప్రోలు: పెసర్లంకలో వరద నీటిలో కుటుంబం



భట్టిప్రోలు: రావిఅనంతవరంలో నీటిలో మునిగిన శివాలయం



కొల్లూరు: పల్లెపాలెంలో నీట మునిగిన ఇళ్లు



కొల్లూరు: పెదపులివర్రు వద్ద కోతకు గురయ్యే ప్రదేశంలోని ఇసుక బస్తాలను పరిశీలిస్తున్న ఎస్పీ డూడీ



కొల్లూరు: అరవింద వారధిపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు


గండ్ల భయంతో.. ఉరుకులు పరుగులు

- ఏ క్షణంలోనయినా కరకట్ట తెగొచ్చు..
- రేపల్లె, పల్లెపాలెం వాసులు అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్
- అధికారులను పరుగులు పెట్టించిన వరద నీరు
- కొన్నిచోట్ల కట్టపైనుంచి బయటకు పొంగిపొర్లుతూ...
- లీకులను అరికట్టేందుకు రోజంతా శ్రమిస్తూనే...
- మరోపక్క సముద్రపు అమావాస్య పోటు దెబ్బ

కృష్ణా నదికి వరద ప్రవాహం ఇప్పటి వరకు నదీతీరంలోని గ్రామాలనే భయపెడితే, కృష్ణా కుడి కరకట్ట వెలుపలఉన్న గ్రామాలవాసులనూ కంటిపై నిద్ర లేకుం డా వెన్నులో వణుకు పుట్టిస్తోంది. గత ఓలేరు గండి ఉగ్రరూపాన్ని చూసిన కృష్ణా తీరవాసులు ఇప్పుడు మరో గండి రూపంలో విపత్తు విరుచుకుపడుతుందన్న భయంతో వణికిపోతున్నారు. ప్రకాశం బ్యారేజి దిగువున కొల్లిపర మండలం వల్లభాపురం మొదలుకుని సముద్రం అంచునున్న రేపల్లె మండలం లంకెవానిదిబ్బ వరకు కరకట్ట వెంటున్న గ్రామాల వారికి కరకట్ట బలహీనత కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. గతంలో ఓలేరు దగ్గర పడిన గండికి దగ్గర్లోనే మరో రెండు చోట్ల కరకట్ట పైనుంచి నీరు ప్రవహిస్తుండటం ప్రస్తుతం అందరినీ భయపెడుతున్న విషయం. కరకట్ట ఆధునికీకరణ పనులు ఇక్కడ జరగకపోవటంతో మనిషి వెళ్లటానికి కూడా వీలు లేని విధంగా కరకట్ట ముళ్ల చెట్లతో, కుంగిపోయి ఉంది. దీంతో కృష్ణానదికి సోమవారం 11.43 లక్షల క్యూసెక్కుల వరద రావటంతో పెదపులివర్రు దగ్గర, పల్లెపాలెం దగ్గర కరకట్ట అంచులకు పైగా నీరు ప్రవహిస్తోంది. దీంతో అప్రమత్తమైన స్థానికులు ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌లతో మట్టిని తీసుకొచ్చి అడ్డుగా పోయటం, ఇసుక మూటలు వేసేందుకు రోజంతా శ్రమిస్తూనే ఉన్నారు. అయినా వరద నీటి లీకేజిని మాత్రం ఆపలేకపోయారు. నీరు చిన్నపాటి జాలుగా కరకట్టకు బయటవైపున్న బ్యాంక్ కెనాల్‌లోకి జారిపోతూనేఉంది. అది ఎప్పుడైనా తెగిపోవచ్చని, గత ఓలేరు గండి తరహాలో నష్టం రేపల్లెకు ఎక్కువగా ఉండొచ్చంటూ జిల్లా కలెక్టర్ వెంకటమురళి హెచ్చరించటం, రేపల్లె పట్టణంపై, మరికొన్ని గ్రామాలపై ప్రభావం ఉంటుందన్న ఆలోచనతో వారిని ఖాళీ చేయించే పని మొదలుపెట్టారు. రేపల్లె పట్టణంలో వరద ముంపు ప్రభావం ఎక్కువగా ఉండే వార్డులను ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆదేశించారు. దీనికిముందే పల్లెపాలెం గ్రామస్తులను అక్కడి నుంచి ఖాళీ చేయించి, సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పెదపులివర్రు దగ్గర ప్రమాదవశాత్తు గండిపడితే గొరికపూడి, కోళ్లపాలెం, పల్లెపాలెం గ్రామాలకు కూడా ఇబ్బంది ఉంటుందన్న ఆలోచనతో వాళ్లను కూడా అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలిచ్చారు. దీనికిపైన పల్లెపాలెం గ్రామం దగ్గరా కరకట్టపై నుంచి నీరు పొంగి బయటకు ప్రవహిస్తోందని సమాచారం రావటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అక్కడా గండి పడకుండా ఆపే ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉన్నారు. ఇదిట్లా ఉంటే.. అటు సముద్రం ఆనుకుని ఉన్న రేపల్లె మండలం లంకెవానిదిబ్బ గ్రామంపైనా గండ్ల ప్రభావం పడింది. రాజుకాల్వ-లంకెవానిదిబ్బ మధ్య కరకట్ట కేవలం నడక దారిగా మారిపోయిం ది. పక్కనే రొయ్యల చెరువులు ఉండటం, పోటు ప్రభావం కూడా ఉండటంతో కరకట్టకు పలుచోట్ల గండ్లు పడుతున్నాయంటూ ఆ గ్రామస్తులు అధికారులకు సమాచారం అందించారు. అయితే ఇక్కడ గండిపడితే గ్రామం సముద్రంతో ఏకమైపోయినట్టే. దీనిపైనా అధికారులు దృష్టిపెట్టారు.

అమావాస్య ఘడియలతో పోటు ముప్పు

ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు వదులుతున్న వరద నీరు సోమవారం మధ్యాహ్నం నుంచి 11.43 లక్షల క్యూసెక్కుల నుంచి 11.27 క్యూసెక్కులకు తగ్గింది. అటు పులిచింతల నుంచి కూడా నిన్నటి వరకు 6 లక్షల నుంచి 6.5 లక్షల వరకు వదిలిన వరద నీటి స్థాయిని సోమవారం 5.43 లక్షలకే తగ్గించారు. అటు మునేరు నుంచి కూడా 2.4 లక్షల క్యూసెక్కుల వరకు వచ్చిన వరద 44వేల క్యూసెక్కులకు తగ్గిపోయింది. కీసర నుంచి మాత్రమే 2 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ నుంచి నీటి విడుదలలో వ్యత్యాసం కనిపించినా, దిగువున మాత్రం వరద ఉధృతి తగ్గటంలేదు. నీటి మట్టం పెరగకున్నా, ఒకేవిధంగా కొనసాగుతూ వస్తోంది. అయితే సోమవారం మద్యాహ్న నుంచి వరద తగ్గకపోగా, ఇంకా పెరుగుతుండటం ఒక సమస్యగా మారింది. దీనికి కారణం... సోమవారం అమావాస్య గడియలు ప్రవేశించటంతో సముద్రం పోటెత్తుతోందని అధికారులు చెబుతున్నారు. సోమవారం అర్ధరాత్రి వరకు పోటు గడియలు ఉంటాయని, పోటు ఉధృతంగా ఉంటే మరింత ముప్పు పెరుగుతుందనేది అధికారుల ఆందోళన. సాధారణంగానే పోటు సమయంలో సముద్రపు నీరు పెనుమూడి దాటుకుని ఓలేరు వరకు చొచ్చుకొస్తుంది. ఇదే పరిస్థితి కొనసాగితే ఏ రాత్రి సమయంలోనయినా గండిపడే పరిస్థితి ఉంటుందని స్థానికులూ ఆందోళన చెందుతున్నారు.



తాడేపల్లి: రైలు వంతెనలను తాకుతూ ప్రవహిస్తున్న వరద నీరు

13 లక్షల క్యూసెక్కులు వచ్చినా తట్టుకునేలా..

సోమవారం అనేకచోట్ల నుంచి వరుసగా కరకట్టకు గండ్లు పడుతున్నాయంటూ అధికారులకు ఫోన్ కాల్స్ రావటంతో అటూ ఇటూ పరుగులుపెట్టారు. గత ప్రభుత్వం కృష్ణా నదికి ఐదేళ్లలో పలుమార్లు వరద వచ్చినా, కరకట్ట భద్రత, దానిని పటిష్టపరచాలనే ఆలోచనకూడా చేయకపోవటంతో ఇప్పుడు దాని ప్రభావం తీర గ్రామాలపై పడుతోంది. సోమవారం ఉదయమే కొల్లిపర మండలం వల్లభాపురం, అత్తలూరివారిపాలెం దగ్గర కరకట్ట కోతపడిపోయిందని, ఇంకా అడుగుమేర నీరు పెరిగితే గండి పడిపోతుందంటూ స్థానికులనుంచి సమాచారం రావటంతో అధికారులు ఉరుకులు పరుగులమీద అక్కడికి చేరుకున్నారు. అదే సమాచారం తెలిసి రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. అప్పటికప్పుడు ఇసుక, ఎర్రమట్టి తెప్పించి, బస్తాలకెత్తించి కోతపడిన చోట రక్షణగా వేయించారు. పలుచోట్ల ఇదే పరిస్థితి ఉండటంతో వాటికి అడ్డుగా మూటలు వేయగలిగారు. దీంతో అక్కడ ప్రమాదం తాత్కాలికంగా తప్పింది. ఆ తర్వాత కొల్లూరు మండలం దోనేపూడి-కోటిపల్లి మధ్య కరకట్టకు గండిపడుతోందంటూ సమాచారం రావటంతో అప్పటికే కొల్లూరులో పర్యటిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు ఆనందబాబు, నరేంద్రవర్మలు జిల్లా కలెక్టర్‌తో కలసి ఉండటంతో గండ్ల పరిస్థితులపై సమీక్షించారు. వెంటనే సిబ్బందిని అక్కడకు పంపించి గండ్లు పడకుండా అడ్డుకట్టలు వేసేలా ఆదేశాలిచ్చారు. అయితే యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని, కరకట్ట ఎక్కడ బలహీనంగా ఉంటే అక్కడ అడ్డు కట్టలు వేయించాలని, రేపటి రోజున 13 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చినా తట్టుకునేలా పనులు ఉండాలని, వాటిని యుద్ధప్రాతిపదికన చేయగలిగేవారికి అప్పగించి పూర్తిచెయ్యాలని మంత్రి గొట్టిపాటి ఆదేశించారు.



కొల్లూరు కరకట్ట వద్ద సముద్రాన్ని తలపిస్తున్న కృష్ణ ప్రవాహం



కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం వద్ద అధికారులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్





భట్టిప్రోలు : రావిఅనంతవరం వద్ద కరకట్టపైకి చేరుకున్న వరద నీరుకు ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేస్తున్న గ్రామస్తులు



కిడ్స్ డైట్



అమ్మ చేతి గోరుముద్ద!

పిల్లలు తినడానికి మొండికేస్తారు. అయిష్టత ప్రదర్శిస్తారు. బలవంతం చేస్తే ఏడ్చేస్తారు. అలాగని వదిలేస్తే పిల్లలకు పోషకాలు అందేదెలా? ఇలాంటప్పుడు పిల్లలకు బలవర్ధక ఆహారం మీద ఇష్టం పెరిగే చిట్కాలు పాటించాలి!

పిల్లల పోషకాహారం గురించిన అవగాహన తల్లుల్లో పెరగడం అభినందనీయమే! అయితే ఆ ఆహారంలో విటమిన్లు, ఖనిజలవణాలు, మాంసకృత్తులు, పిండిపదార్థాలు ఉండేలా సరి చూసుకోవడమూ అవసరమే! అయితే అవన్నీ ప్రాంతీయపరమైన, సంప్రదాయపూరితమైన, రుతుపరమైన ఆహార పదార్థాలేనా? మనం తినే ఆహారం, నివసించే వాతావరణాలతో మన అనుబంధం కాలక్రమేణా బలహీనపడుతోంది. ఇప్పటికి పదేళ్ల వెనక్కు వెళ్తే ఏ ఇంట్లో చూసినా పప్పు, అన్నంతో కూడిన భోజనమే తినేవాళ్లం. పిల్లలూ వాటినే ఇష్టంగా తినేవాళ్లు. కానీ ఇప్పుడు పోషకాల మీద పెరిగిన అవగాహన మూలంగా, పిండిపదార్థాలు, కొవ్వులను దూరం పెట్టేస్తున్నాం. ఏం కొంటున్నా, లేబుల్ పరీక్షించి, కేలరీలు లెక్కిస్తున్నాం. కానీ ఇలాంటి విపరీతమైన అప్రమత్తత వల్ల ఎక్కువ సందర్భాల్లో విలువైన పోషకాలకు దూరమవుతున్నాం. ఫిట్‌గా ఉండడానికి బదులు లావుగా తయారవుతున్నాం, తేలికగా జబ్బుల బారిన పడుతున్నాం. పోషకాలను బట్టి ఆహారాన్ని ఎంచుకునే ధోరణి వల్ల లాభపడేది ఆహార సంస్థలే! ప్రజల ఆరోగ్యానికి ఈ ధోరణి ఏమాత్రం ప్రయోజనకారి కాదు. కాబట్టి మరీ ముఖ్యంగా పిల్లలకు ఇచ్చే ఆహారం విషయంలో అమ్మమ్మల నాటి పాతవి, ఆరోగ్యకరమైన పద్ధతులనే ఎంచుకోవాలి.

అమ్మమ్మల ఆహారం!

ప్రపంచం మొత్తంలో స్థూలకాయం కలిగిన పిల్లలున్న దేశంగా భారతదేశం రెండవ స్థానంలో ఉంది. అంతమాత్రాన మనం పిల్లలు, వారి ఆహారపుటలవాట్లను అశ్రద్ధ చేస్తున్నామని కాదు. నిజానికి వారి ఆహారం పట్ల మనం అవసరానికి మించిన శ్రద్ధ ప్రదర్శిస్తున్నాం. పోషకాలున్న ఆహారం అది ప్రాంతీయమైనది కాకపోయినా, వెతికి వెతికి తినిపిస్తున్నాం. కానీ మన అమ్మలు, అమ్మమ్మలు ఇలా చేయలేదు. ఏ రుతువులో కాచే కాయలను ఆ రుతువుల్లో తినిపించారు. పొట్టు తీయని ధాన్యాలు, పెరట్లో పండిన కూరగాయలు, పళ్లు అందించారు. అప్పట్లో వంటగది ఇంటి మధ్యలో ఉండేది. ఎప్పుడు అవసరమైతే అప్పుడు వంటింట్లోకి వెళ్లి ఆహారం అందుకుని తినేటందుకే ఈ ఏర్పాటు. పాలు, పెరుగు, కమ్మని వెన్న, నెయ్యి, జున్నులు ప్రతి ఇంట్లో తాజాగా, సిద్ధంగా ఉండేవి. సున్నుండలు, అరిసెలు లాంటి బలవర్ధకైన చిరుతిళ్లు డబ్బాల్లో నింపి ఉంచేవారు. సెనగపప్పు ఉండలు, వేరుశనగ చెక్కలు, బెల్లం జిలేబీలు...ఇవన్నీ రక్తవృద్ధిని పెంచే చిరుతిళ్లే! వీటిలో ఎటువంటి ప్రిజర్వేటివ్స్, కృత్రిమ రంగులూ ఉండవు. కానీ ఇలాంటి వంటలు వండే బదులు, పాశ్చాత్య ఆహార పద్ధతులను అనుసరిస్తూ మాంసకృత్తుల కోసం సోయా, అవకాడోల మీద, పీచు కోసం ఓట్స్ మీద ఆధారపడుతున్నాం! వీటికంటే మెరుగైన ప్రత్యామ్నాయ, సంప్రదాయ పదార్థాలు ఎన్నో ఉన్నాయి.

పేచీ పెట్టే పిల్లలతో ఇలా...

కొంతమంది పిల్లలు తినడానికి పేచీ పెడతారు. ఆరోగ్యకరమైన ఆకుకూరలు, కూరగాయల పట్ల అయిష్టత ప్రదర్శిస్తారు. ఇలాంటప్పుడు పిల్లలకు ఆ ఆహారం పట్ల ఆసక్తి ఏర్పరిచే ప్రయత్నంచేయాలి. ఇందుకోసం పాలకూరను పెరట్లోనే పెంచాలి. పూల తొట్లలో కొత్తిమీర, పుదీనా, ఆకుకూరల విత్తనాలు చల్లి పిల్లల చేత వాటికి నీళ్లు పోయిస్తూ ఉండాలి. కూరగాయలు, ఆకుకూరలు ఎదిగే క్రమాన్ని పిల్లలు పరిశీలించేలా చేయాలి. అలాగే కూరగాయలు పండించే తోటలకు అరుదుగానైనా పిల్లలను తీసుకెళ్తూ ఉండాలి. పళ్లు, కూరగాయ మొక్కలను పిల్లలు గమనించేలా చేయాలి. ఇలా చేయడం వల్ల ఆ మొక్కల ఉత్పత్తుల పట్ల పిల్లలకు ఆసక్తి పెరుగుతుంది. వాటి వంటలను ఆస్వాదించాలనే కోరిక కూడా పెరుగుతుంది. ఆహారంతో అనుబంధం ఏర్పరచాలంటే పర్యావరణంతోనూ అనుబంధం ఏర్పరచాలి. పెద్దలు ఈ విషయంలో పిల్లలకు మార్గనిర్దేశకులుగా మారాలి. అలాగే బయట భోజనాలకు స్వస్తి చెప్పి, ఇంటి భోజనానికే పెద్దలు కట్టుబడి ఉండాలి. పిల్లలకూ ఆ అలవాటు నేర్పాలి. వంటింట్లో వంటపనిలో నిమగ్నమయ్యే తల్లులను చూసిన పిల్లలు కచ్చితంగా వంటగదిలో తయారయ్యే ఆహారాన్ని ఇష్టపడతారు. అలాగే కుటుంబసభ్యులందరూ నిర్దిష్ట సమయాల్లో కలిసి కూర్చుని భోజనం చేసే కట్టుబాటు అనుసరించాలి. ఆ సమయంలో టివి, సెల్‌ఫోన్ లాంటి వాటికి చోటు ఇవ్వకూడదు.

> **పిల్లల ఆహారం పసందుగా...**
>
> అన్నం, వేరుసెనగపప్పు, నెయ్యి, ఒక పండు, ఇంట్లో తయారైన లడ్డు... ఇదీ పిల్లలకు అనునిత్యం ఇవ్వవలసిన ఆహారం. వీటితోపాటు కూరగాయలు, ఇంట్లో వండిన ఎటువంటి ఆహారమైనా ఇవ్వవచ్చు. చిరుతిళ్లుగా గుప్పెడు వేరుసెనగపప్పులు, తాజా పండ్లు, అటుకుల ఉప్మా, గోధుమరొట్టె, బెల్లం ముక్క, ఇంట్లో తయారైన సున్నుండలు, లడ్లు... ఇలా పోషకభరితమైన చిరుతిళ్లను పిల్లలకు అలవాటు చేయాలి. 'ఫలానా పాఠం తప్పు లేకుండా రాసి చూపిస్తే, చాక్లెట్లు ఇప్పిస్తా!' లాంటి ఆశ పెట్టే పద్ధతులు మానేయాలి. చాక్లెట్లను వారానికి ఒకసారికే పరిమితం చేయాలి. గోధుమ బియ్యంలో పోషకాలు అధికం. అలాగని వాటిని వండి పెడితే పిల్లలు తినడానికి ఇష్టపడరు. కాబట్టి బియ్యంతోపాటు రెండు గరిటెల గోధుమ బియ్యం కలిపి వండి పెట్టవచ్చు. క్యారట్, క్యాప్సికమ్ లాంటి కూరగాయలను అందమైన ఆకారాల్లో కోసి, ఆకర్షణీయమైన అలంకరణతో వడ్డించి, పిల్లల్లో ఆసక్తిని రేకెత్తించవచ్చు. వీలైనంత వరకూ భిన్నమైన పోషకాలు అందేలా మూడు, నాలుగు కూరగాయలను కలిపి వండవచ్చు. ఇలా పిల్లలకు నచ్చే, వారు మెచ్చే తరహాలోనే ఆహారం పట్ల వారికి ఇష్టాన్ని రెట్టింపు చేయవచ్చు.



పోషకాల చిరుతిళ్లు ఇవే!

పిల్లలకు జంతికలు, గవ్వలు లాంటి నిల్వ పిండిపదార్థాలనే చిరుతిళ్లుగా ఇవ్వవలసిన అవసరం లేదు. పచ్చి కూరగాయ ముక్కలకు ఉప్పు, నిమ్మరసం, చాట్ మసాలా జోడించి సలాడ్‌గా అందించవచ్చు. మొలకెత్తిన పెసలు, సెనగలు ఒక టీస్పూన్ నూనెలో వేయించి, క్రంచీగా ఉండడం కోసం వేయించిన వేరుసెనగ పప్పులు చల్లి, నిమ్మరసం కలిపి అందించవచ్చు. షియా విత్తనాలు నానబెట్టి, పండ్ల ముక్కలు, తేనె కలిపి తినిపించవచ్చు. కీర దోస లేదా జుకినిలను పొడవుగా తరిగి, ఉప్పు, చిల్లీఫ్లేక్స్, మొక్కజొన్న పిండి కలిపిన మిశ్రమంలో ముంచి, బ్రెడ్ పొడి అద్ది నూనెలో వేయించి అందించవచ్చు. కూరగాయలు కలిపి ఆమ్లెట్ వేసి ఇవ్వొచ్చు. పులిసిన పిండితో రొట్టెలు, చద్ది అన్నంతో దద్దోజనం లాంటివి కూడా ఆరోగ్యకరమే! ఆవిరి మీద ఉడికించిన చికెన్, చేప ముక్కలు లేదా గ్రిల్ చేసినవీ పిల్లలకు అందించవచ్చు. పండ్లముక్కలతో కస్టర్డ్ తయారుచేసి పెట్టవచ్చు.

ఆకలి తెలియనివ్వాలి

సాధారణంగా భోజన వేళకు పిల్లలు కూడా కడుపు నిండా తినడం అన్నిసార్లూ వీలుపడకపోవచ్చు. అప్పుడప్పుడూ పిల్లల ఆకలి మందగిస్తూ ఉంటుంది. కాబట్టి తినడానికి పేచీ పెట్టినప్పుడు, బలవంతంగా తినిపించే ప్రయత్నం చేయకూడదు. ఆకలి ఉంటేనే పిల్లలకు ఆహారం అందించాలి. భయపెట్టి, బుజ్జగించి తినిపించడం వల్ల తల్లులు ఆశించే ప్రయోజనం నెరవేరకపోవచ్చు. సాధారణంగా తల్లులు, బడికెళ్లే ఈడు వరకూ పిల్లలకు ముద్దలు చేసి తినిపిస్తూ ఉంటారు. కానీ ఈ పద్ధతి కూడా సరికాదు. నడక వచ్చిన వయసు నుంచే పిల్లలు స్వతంత్రంగా తినే అలవాటు చేయాలి. ప్రతి రోజూ ఒకే సమయానికి, ఒకే ప్రదేశంలో తినే ఏర్పాట్లు ఉండాలి. పదార్థాలు నేల మీద పడిపోతాయనో, పిల్లలు చిందరవందర చేస్తారనో, దుస్తులు పాడైపోతాయనో పిల్లలను సొంతగా ఆహారం తిననివ్వకుండా అడ్డుకోకూడదు. పిల్లల కోసం ప్రత్యేకంగా తయారయ్యే స్పూన్లు, ఫోర్కులు, బౌల్స్, ప్లేట్స్‌నే వాడుకోవడం వల్ల వాటితో పిల్లలకు గాయాలు అవకుండా ఉంటాయి. నేల మీద పడినా పగిలిపోకుండా ఉండే పదార్థాలతో తయారైన పాత్రలు, స్పూన్లనే వాడుకోవాలి.

గ్యాస్ వేధిస్తుంటే..

వేళకు తినకపోవడం, తిన్నా అరగకపోవడం చాలా మందికి ఎదురయ్యే సమస్య. వేపుళ్లు, జంక్ ఫుడ్, అధిక నూనెతో వండిన వంటకాలను తినటం వల్ల గ్యాస్ పెరిగి కడుపుబ్బరం సమస్య ఎర్పడుతుంది. దీనికి చిన్న చిట్కాలతో పరిష్కారం లభిస్తుంది. అవేమిటో చూద్దాం..

సమస్య మూలమిది: మనం తిన్న ఆహారం కడుపులోకి వెళ్లిన తరువాత.. జీర్ణం అవుతుంది. ఆ జీర్ణప్రక్రియలో కొన్ని రకాల వాయువులు విడుదలవుతాయి. కొన్ని సార్లు, అవి బయటికి వెళ్లకుండా కడుపులోను, పేవులలోను పేరుకుపోతాయి. అవి చెడువాయువులుగా మారి ఇబ్బంది పెడతాయి. ఆయుర్వేదంలో ఈ సమస్యను ఆర్మానం, ఆటోపం అంటారు. ఈ వాయువులు బయటకు వెళ్లకపోతే ఆ ప్రభావం గుండె.. ఊపిరితిత్తులపై పడుతుంది. గుండె దడ, ఆందోళన, గుండెల్లో నెప్పి మొదలైన లక్షణాలు కనిపిస్తాయి. ప్రతి రోజు క్రమం తప్పకుండా పల్చటి మజ్జిగ తాగితే ఈ సమస్య చాలా వరకూ పరిష్కారమవుతుంది.

చిట్కాలివే: అరిటి బోద లోపల తెల్లటి పదార్థం ఉంటుంది. దీని రసాన్ని రోజుకు ఒక కప్పు చొప్పున 15



రోజులు తాగితే గ్యాస్ సమస్య తగ్గిపోతుంది.

- అల్లం రసం తీసి దానిని వేడిచేసి తగినంత బెల్లం కలపాలి. ఇలా కలిపిన మిశ్రమాన్ని రోజుకు ఒక స్పూను తాగాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే కడుపుబ్బరం తగ్గిపోతుంది.
- గింజలున్న ఎండిన నల్ల ద్రాక్షను తీసుకొని నీళ్లలో ఆరు గంటలు నానబెట్టాలి. ఇలా నానిన ద్రాక్ష రసాన్ని తాగితే గ్యాస్ సమస్య తగ్గుతుంది.
- శొంఠిపొడి, పాత బెల్లంపొడిలను సమ పాళ్లలో కలుపుకోవాలి. ప్రతి రోజూ ఉదయం ఈ మిశ్రమాన్ని ఒక స్పూను తినాలి. ఆ తర్వాత వేడి నీళ్లు తాగాలి. ఇలా తాగితే కడుపులో ఉన్న మలినాలన్నీ తొలగిపోతాయి.
- ధనియాలు, శొంఠిలను సమపాళ్లలో తీసుకొని.. వేడి నీటిలో మరిగించాలి. అలా తయారయిన కషాయాన్ని తాగి నడిస్తే- గ్యాస్ సమస్య తగ్గుతుంది.
- సోంపు, జీలకర్ర, వాములను సమపాళ్లలో తీసుకొని పొడి చేయాలి. ఈ పొడిని ఉదయం, సాయంత్రం ఒక స్పూను చొప్పున వేడి నీళ్లలో వేసుకొని తాగాలి. ఇలా తాగితే వారం రోజుల్లో గ్యాస్ సమస్య తొలగిపోతుంది.

బ్లడ్ గ్రూప్ డైట్

కార్బ్స్ కావలసిందే!

కార్బ్స్‌ను పూర్తిగా దూరం పెట్టేసే డైట్ ట్రెండ్‌ను విస్తృతంగా అనుసరించేవాళ్లున్నారు. కానీ శక్తిని సమకూర్చే పిండిపదార్థాలను పూర్తిగా మానేస్తే శరీరానికి శక్తి సమకూరేదెలా? మంచి, చెడు పిండిపదార్థాల్లో వేటిని ఏ పరిమాణంలో తీసుకోవాలో అవగాహన ఏర్పరుచుకుని తదనుగుణంగా మసలుకోవాలి.

పిండిపదార్థాలు ప్రధాన పోషకాలు. మనం రోజూ తీసుకునే ఆహారంలో 70% పిండిపదార్థాలే ఉంటాయి. జీర్ణవ్యవస్థ పిండిపదార్థాలను గ్లూకోజ్‌గా మారుస్తుంది. శరీరం ఈ గ్లూకోజ్‌ను కణజాలం, కణాలు, అవయవాల శక్తి కోసం వినియోగిస్తుంది. కాబట్టి శక్తినిచ్చే పిండిపదార్థాలు పూర్తిగా మానేయడం అవివేకం.

పిండిపదార్థాలు లోపిస్తే?

శక్తికి మూలాలైన పిండిపదార్థాలు లోపిస్తే శరీరం పలు లక్షణాల రూపంలో ఆ లోపాన్ని బహిర్గతపరిచే ప్రయత్నం చేస్తుంది. అవేంటంటే...

- నీరసం
- నోటి దుర్వాసన
- మలబద్ధకం
- వాంతులు
- తలనొప్పి
- పోషకలోపం

డి - గ్లూకోజ్

అత్యంత ముఖ్యమైన, కీలకమైన పిండిపదార్థం గ్లూకోజ్. అన్ని జీవరాశులు శక్తి కోసం వాడుకునే సులువైన చక్కెర (మోనోశాఖరైడ్) ఇది. అయితే పిండిపదార్థాలు శరీర బరువును కచ్చితంగా పెంచుతాయి. అవసరం లేని చెడు పిండిపదార్థాలు ఎక్కువగా తీసుకుంటూ, అవసరం ఉన్న మంచి పిండిపదార్థాలను పరిమితంగా తీసుకునేవారికి ఈ సమస్య సహజం. కాబట్టి వాటిలో ఏవి మంచి, ఏవి చెడు? అనే విషయం మీద అవగాహన ఏర్పరుచుకోవాలి.



మంచి పిండిపదార్థాలు (కాంప్లెక్స్ కార్బ్స్)

వీటిలోని రసాయన రూపం, పీచులను జీర్ణం చేసుకోవడానికి శరీరం ఎక్కువ శక్తిని ఖర్చుచేయవలసివస్తుంది. వీటి నుంచి అందే శక్తి శరీరానికి ఎక్కువ సమయంపాటు ఉపయోగపడుతుంది. మంచి పిండిపదార్థాలలో...

- పోషకాలు, పీచు ఎక్కువ
- గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ
- తక్కువ క్యాలరీలతోనే కడుపు నిండుతుంది
- శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం (మెటబాలిజం) పెరుగుతుంది.

పొట్టు తీయని గోధుమలతో తయారైన బ్రెడ్, రొట్టెలు, తృణధాన్యాలు, ఆకుపచ్చని కూరగాయలు, చిలకడదుంపలు, తాజా పళ్లు ఈ కోవకు చెందినవి.

చెడు పిండిపదార్థాలు (సింపుల్ కార్బొహైడ్రేట్స్)

ఇవన్నీ పొట్టు తీసి, పాలిష్ చేసిన పదార్థాలు. వీటిలో సహజసిద్ధ పోషకాలు, పీచు తక్కువ. చెడు పిండిపదార్థాల్లో...

- పీచు, పోషకాలు అతి స్వల్పం
- గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువ
- క్యాలరీలు కొవ్వుగా మారతాయి
- అత్యధిక గ్లూకోజ్ స్థాయులు (నీరసం తెప్పిస్తాయి)

చాక్లెట్లు, తీపి పదార్థాలు, తీపి జోడించిన తృణధాన్యాలు, సోడాలు, శీతల పానీయాలు, పొట్టు తీసిన పిండ్లు ఈ కోవకు చెందినవి.

మేలురకం పిండిపదార్థాలు వీటిలో...

ఓట్స్‌తో తయారైన బిస్కెట్లు, నారింజ రసం, యాపిల్, కేరట్లు, టమేటాలు, ఎండుద్రాక్ష, ద్రాక్ష, అరటిపళ్లు.

- **ఓట్‌మీల్:** ఎక్కువ సమయంపాటు శక్తినిచ్చే నిలకడైన పిండిపదార్థం ఇది. నీళ్లు కలిపి తయారుచేసిన ఒక కప్పు ఓట్‌మీల్‌లో 159 క్యాలరీలు ఉంటాయి. 4 గ్రాములు పీచు, 6 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి.
- **యాపిల్:** భోజనానికి, భోజనానికి మధ్య తీసుకోవలసిన ఈ అల్పాహార ఫలంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించే 4 గ్రాముల పీచు, పెక్టిన్‌లు ఉంటాయి. మాంసకృత్తులు పుష్కలంగా ఉండే వేరుసెనగపప్పుతో తయారయ్యే వెన్నతో కలిపి తీసుకుంటే ప్రయోజనకరం.
- **చిలకడదుంపలు:** ఇది నిజమైన 'సూపర్ ఫుడ్'. కప్పు చిలకడదుంప ముక్కల్లో 7 గ్రాముల పీచు, అత్యధిక విటమిన్ ఎ, సిలు, 4 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి.
- **మినుములు:** ఒక కప్పు ఉడకబెట్టిన పొట్టు తీయని మినుముల్లో 15 గ్రాముల పీచు, అంతే పరిమాణంలో మాంసకృత్తులు ఉంటాయి. ఇంత పరిమాణంలో పోషకాలు మరే పదార్థంలోనూ ఉండవు.
- **టమేటాలు:** వీటిలో విటమిన్లు, ఖనిజలవణాలు పుష్కలం. పీచుతో పాటు లైకోపీన్ అనే యాంటీఆక్సిడెంటు కూడా వీటిలో ఉంటాయి.

- కరకట్టల పటిష్టతను పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- వాటి సమీపంలో గతంలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- నేడు నీటి ప్రవాహ ఉద్ధృతికి విస్తృతంగా లీకులు
- తీవ్ర భయాందోళనలో కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు
- బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయిన 30 గ్రామాలు

గత పాపం.. నేటి శాపం..!


భట్టిప్రోలు: పెదపులివర్రు కరకట్ట పరిస్థితిపై వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటమురళి


భట్టిప్రోలు: లంక గ్రామాల్లో చిక్కుకున్న తమ వారి వివరాలు తెలుసుకోవడానికి వెల్లటూరు కరకట్ట వద్దకు చేరుకున్న బంధువులు


రేపల్లె: ఎక్స్‌కవేటర్‌తో ఓలేరు కరకట్టకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం


రేపల్లె: ట్రాక్టర్ ద్వారా కరకట్టపై వేస్తున్న ఇసుక బస్తాలు

బాపట్ల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పాలనలో కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో ఉన్న కరకట్టల పటిష్టానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోగా కరకట్టల సమీపంలో కూడా నిబంధనలు ఉల్లంఘించి యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకున్న ఘనత గత వైసీపీ ప్రభుత్వానిది. 2019 ఎన్నికలకు ముందు ప్రచారంలో భాగంగా కరకట్టలను బలోపేతం చేయడానికి ప్రణాళికలు రూపొందించడంతో పాటు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని మాజీ సీఎం జగన్ హామీ ఇచ్చారు. గత ఐదేళ్ల పాలనలో వాటి పటిష్టానికి ఒక్క రూపాయి విదిల్చిన పాపాన పోలేదు. వాటికి కనీస మరమ్మతులు కూడా ఏళ్ల తరబడి చేయకపోవడంతో అవి లీకుల దశకు కొన్నిచోట్ల, గండ్లుపడి మరికొన్ని చోట్ల ప్రమాదస్థితికి చేరుకున్నాయి. ఈ క్రమంలో ఎడతెరిపిలేని వర్షాల కుతోడు పైనుంచి వరదనీరు ప్రకాశం బ్యారేజీకి పోటెత్తడంతో రికార్డు స్థాయిలో గత శతాబ్దకాలంలో ఎన్నడూ లేనివిధంగా 11.5 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో కొల్లూరు, రేపల్లె, భట్టిప్రోలు మండలాల పరిధిలోని 30 లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రకృతి ప్రకోపానికి ఆ గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తుంటే గత ప్రభుత్వ తప్పిదాలకు కరకట్టలకు లీకులై ఏ క్షణాన గండి పడి మెరకన ఉన్న ఊళ్లను కూడా ముంచెత్తుతాయనే భయం నెలకొంది. ముఖ్యంగా భట్టిప్రోలు మండల పరిధిలోని పెదపులివర్రు కరకట్టకు పడ్డ లీకులు రేపల్లె ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది

ఓ వైపు నీటమునిగిన లంక గ్రామాలు...

లంకల పరిధిలో ఉన్న 30 గ్రామాల ప్రజలకు ఆదివారం రాత్రి నుంచే బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. సోమవారం ఉదయానికి రెండు వేల మందిని పునరావాసా శిబిరాలకు తరలించిన అధికారులు, గ్రామాల్లో చిక్కుకుపోయిన వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్న వారిమీద దృష్టి పెట్టి బయటకు తీసుకొచ్చారు. లంక గ్రామాల్లో కరెంటు సరఫరాను నిలిపివేసి జనరేటర్ల ద్వారా విద్యుత్‌ను అందిస్తున్నారు. వారికి అవసరమైన ఆహారాన్ని పడవల ద్వారా గ్రామాల్లోకి అధికారులు పంపిస్తున్నారు. లంక గ్రామాల్లోకి వెళ్లే మార్గాలను నాలుగు పాయింట్లుగా విభజించి అక్కడ ఇద్దరు అధికారులను ఇన్చార్జిలుగా నియమించారు.

మరోవైపు కరకట్టలకు లీకులు

భట్టిప్రోలు మండల పరిధిలోని పెదపులివర్రు కరకట్టతోపాటు ఓలేరు పల్లెపాలేనికి లీకులు పడడంతో యంత్రాంగం పరుగులు పెట్టింది. ఇసుక బస్తాలు, కంకరతో వాటిని పూడ్చే ప్రయత్నం చేస్తున్నా, పైనుంచి వస్తున్న వరద ప్రవాహం ధాటికి కరకట్టకు సమానంగా నీళ్ల ప్రవహిస్తుండడంతో ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న టెన్షన్ అక్కడి ప్రజల్లో నెలకొంది. ముఖ్యంగా పెదపులివర్రు కరకట్టకు గండి పడే ప్రమాదం పొంచి ఉందనీ, అదే జరిగితే ఆ నీరు రేపల్లె పట్టణాన్ని ముంచెత్తే అవకాశం ఉండడంతో ముందస్తు చర్యల్లో భాగంగా రేపల్లె పట్టణ ప్రజానీకాన్ని జిల్లా కలెక్టర్ వెంకటమురళి అలెర్ట్ చేశారు. పెదపులివర్రు కరకట్ట వద్ద జరుగుతున్న పనులను పరిశీలించడానికి వెళ్లిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు, జిల్లా కలెక్టర్ వెంకటమురళి ప్రతి గంటకు ఆరా తీసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

రికార్డు స్థాయిలో వరద

10 లక్షల క్యూసెక్కుల వరదను కూడా గతంలో చూసిన లంక గ్రామాల ప్రజలు ప్రస్తుతం వచ్చిన 11.5 లక్షల క్యూసెక్కుల ప్రకాశం బ్యారేజీ ప్రవాహాన్ని శతాబ్ద కాలంలో ఎప్పుడూ చూడలేదని, ఈ స్థాయిలో వరద బీభత్సం ఊహించలేదని లంక గ్రామాల ప్రజలు కన్నీరుమున్నీరవుతున్నారు. దిగువకు వస్తున్న వరద ప్రవాహానికి తోడు సముద్రం ఆటుపోట్లు అటు అధికార యంత్రాంగాన్ని, ఇటు ప్రజలను మరింత కలవరపెడుతున్నాయి. పెదపులివర్రు కరకట్టకు లీకులు ఏర్పడడంతో యంత్రాంగం రేపల్లె ప్రజలను అప్రమత్తం చేసింది. 2009లో ఓలేరు కరకట్టకు గండిపడి నీటి ప్రవాహం ముంచెత్తి ఆనాడు మిగిల్చిన చేదు జ్ఞాపకాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

సహాయక చర్యలపై మంత్రి గొట్టిపాటి ఆరా..

వరద ఉధృతికి ముంపునకు గురైన పొలాలతోపాటు కొల్లూరు మండల పరిధిలోని లంక గ్రామాల్లో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం పర్యటించి బాధితులకు అందుతున్న సహాయంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత బాపట్ల నియోజకవర్గ పరిధిలోని కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లో ముంపునకు గురైన పొలాలను పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం కనీసం కాలువల్లో పూడికతీత కూడా చేపట్టక పోవడం వల్లే ప్రస్తుతం ఈ పరిస్థితి తలెత్తిందని రైతులు మంత్రి ముందు వాపోయారు. అన్నదాతలను అన్ని విధాల ఆదుకుంటామని మంత్రి వారికి భరోసా ఇచ్చారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు ఆనంద్‌బాబు, వేగేశన నరేంద్రవర్మ, జిల్లా కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడీ ఉన్నారు.

పెరుగుతున్న వరద ఉధృతి

రేపల్లె, సెప్టెంబరు 2: కృష్ణానది నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. రావిఅనంతవరం, పల్లెపాలెం, మైనేనివారిపాలెం, కనగాలవారిపాలెం, రుద్రవరం గ్రామాల వద్ద కరకట్టలు బలహీనంగా ఉండటంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. అధికారులు కరకట్ట పల్లపు ప్రాంతాల్లో ఇసుక గోతాలతో కట్టలను అభివృద్ధి పరుస్తున్నారు. రావిఅనంతవరం వద్ద ఇసుక కట్టలు వేసినప్పటికీ నీరు కట్టదాటుతూనే ఉంది. అయితే అధికారులు గ్రామస్థులను చైతన్యపరిచి నీరు కట్ట దాటకుండా ఇసుకమట్టితో అడ్డుకట్ట వేస్తూనే ఉన్నారు. బలహీనంగా ఉన్న కరకట్టలను గత ప్రభుత్వం అభివృద్ధి చేయలేదు. మండలంలోని పల్లెపాలెం గ్రామం పూర్తిగా నీటిలో నిలిచిపోయింది. గ్రామంలోని ప్రజలను బోటు సహాయంతో సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించారు. ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి వారికి సహాయ, సహకారాలు అందిస్తుంది. పల్లెపాలెంలో మత్స్యకారులు బోటులోనే జీవనం సాగిస్తున్నారు. వరదకు రొయ్యల చెరువులు, పంట పొలాలు ముంపునకు గురై లక్షలాది రూపాయల నష్టం జరిగిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పెనుమూడి వద్ద ఆంజనేయస్వామి, రావిఅనంతవరం వద్ద శివాలయం, మోర్తోట దేవాలయాలు పూర్తిగా నీటిలో ఉన్నాయి. ఎన్‌డీఆర్ఎఫ్ బృందం, గజ ఈతగాళ్ల ఎప్పటికప్పుడు వరద ప్రాంతాలను పర్యవేక్షిస్తున్నారు.


రేపల్లె: పల్లెపాలెంలో పడవలోనే జీవనం


రేపల్లె: పల్లెపాలెం నివాసాల్లోకి వరదనీరు...


బోటులో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న రేపల్లె అధికారులు

కొనసాగుతున్న రైళ్ల రద్దు, దారి మళ్లింపు

గుంటూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వర్షం తగ్గినా వరద సృష్టించిన బీభత్సం కారణంగా రైల్వేట్రాక్‌లు దెబ్బతినడంతో మంగళవారం కూడా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 12706 సికింద్రాబాద్ - గుంటూరు ఇంటర్‌సిటీని ఈ నెల 3న, 12705 గుంటూరు - సికింద్రాబాద్ ఇంటర్‌సిటీని ఈ నెల 4న రద్దు చేస్తున్నట్లు చెప్పారు. సోమవారం నంబరు. 17015 భువనేశ్వర్ - సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్‌ని రద్దు చేశారు. 22702 గుంటూరు - విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్‌ని కూడా సోమవారం రద్దు చేశారు. ఈ నెల 3న 12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి, 17016 సికింద్రాబాద్ - భువనేశ్వర్ విశాఖ, ఈ నెల 2 సోమవారం 12703 హౌరా - సికింద్రాబాద్ ఫలక్‌నుమాని రద్దు చేశారు. కాగా ఇంకా రైల్వేట్రాక్ మరమ్మతులు పూర్తి కాని దృష్ట్యా కొన్ని రైళ్లను నడికుడి మార్గంలో మళ్లించనున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. వాటిల్లో నంబరు. 18046 హైదరాబాద్ - షాలిమార్, 12728 హైదరాబాద్ - విశాఖపట్టణం, 12764 సికింద్రాబాద్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లను ఈ నెల 3వ తేదీన పగిడిపల్లి, నడికుడి మార్గంలో నడపనున్నట్లు చెప్పారు.

ఎటువంటి నష్టం జరిగినా సహించేది లేదు

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, సెప్టెంబరు 2: ఎటువంటి ప్రాణ నష్టం, పశునష్టం జరిగినా సహించేది లేదనీ, అధికారులందరూ వరద ప్రవాహిత ప్రాంతాల్లో 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని బొమ్మువానిపాలెం, అన్నవరంలంక, పిడపర్తిపాలెం, మున్నంగి, వల్లభాపురం గ్రామాల్లో మనోహర్ అధికారులతో కలిసి పర్యటించారు. కృష్ణానదికి వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని బొమ్మువానిపాలెం, అన్నవరంలంక గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తక్షణమే తరలించాలని అధికారులకు ఆదేశించారు. అత్తలూరివారిపాలెం, వల్లభాపురం, పిడపర్తిపాలెం సమీపంలో వరద ఉధృతికి కృష్ణానది కరకట్ట పలుచోట్ల కోతకు గురవటంతో ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణానదికి వరద పెరుగుతుందని తెలిసికూడా ఎందుకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టలేదని వారిపై మండిపడ్డారు. కోతకు గురైనచోట తక్షణ చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. ఇరిగేషన్, నాయకులు వెంటనే ఇసుకను తోలించడంతో మంత్రి మనోహర్ దగ్గర ఉండి ఇసుకను గోతాల్లో పోయించి కోతకు గురైనచోట వేయించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మనోహర్ వరదప్రాంతాల్లో పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ కృష్ణానదికి 11లక్షల 60వేల క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. మండలంలోని వల్లభాపురం వద్ద కరకట్ట కోతకు గురవ్వటంతో విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిశీలించారు. మంత్రి వెంట సబ్‌కలెక్టర్ సంధ్యాసింహ, జాయింట్ కలెక్టర్ భార్గవ్, డీఎస్పీ బి.జనార్ధనరావు, తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

మంచినీరు, భోజనం సకాలంలో అందట్లేదు..

- ముంపు గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే ఆనందబాబు ఎదుట బాధితుల ఆవేదన
- నిర్వాహకుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం


ఆహార పంపిణీ ఆలస్యంపై అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, సెప్టెంబరు 2: వరద బాధితులకు భోజనం, మంచినీళ్ల సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవడంలో అధికారులు పూర్తి వైఫల్యం చెందడంపై ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కొల్లూరు, భట్టిప్రోలు మండలలో వరద ముంపు గ్రామాలకు అందే సహాయకచర్యలను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బాధితులకు మంచినీరు, భోజనం అందకపోవడాన్ని వారు ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో స్టాక్‌పాయింట్‌లకు ఎమ్మెల్యే వెళ్లారు. ఈ విషయమై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. వరద బాధితులకు అందించే ఆహారం ప్యాకెట్లలో కాకుండా గిన్నెల్లో తీసుకురావడంపై ఆయన మరింత మండిపడ్డారు. నీళ్ళలో ఉన్న వారికి ఆహారం ఎలా అందిస్తారంటూ నిర్వాహకులను ప్రశ్నించారు. గిన్నెలు, బకెట్లతో బాధితులకు ఆహారం ఎలా అందుతుందో చెప్పాలని అధికారులను ప్రశ్నించగా వారు నీళ్ల నమిలారు. సమయానికి మంచినీరు, భోజనం అందకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. చేతకాకపోతే తమ పార్టీ నాయకులతో చెప్పి చేయించుకునేవారమని, ఇలా చేయడమేంటని ఆయన అన్నారు. మంగళవారం వరద బాధితులకు భోజనం, మంచీనిరు అందించే ఏర్పాట్లు చేయాలని సకాలంలో వాటిని వారికి అందేలా చేరవేయాల్సిన బాధ్యత తీసుకోవాలని సూచించారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం..

- ఉప్పలపాడు బాధితుల్లో ధైర్యాన్ని నింపిన నరేంద్ర కుమార్


ఉప్పలపాడు బాధిత కుటుంబానికి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పెదకాకాని, ఆ సెప్టెం బరు 2: మీకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉం టుంది.. అధైర్య పడకండి.. నేను ఉన్నా.. అంటూ పొన్నూరు ఎమ్మెల్యే ధూ ళిపాళ్ల నరేంద్రకుమార్ ఉప్పలపాడు బాధిత కుటుంబాలకు సోమవారం భరోసా కల్పించారు. అకాల వర్షం వలన వరద ఉధృతికి పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామంలో మరణించిన పసుపులేటి సాదీన్(8), నడింపల్లి రాఘవేంద్రరావు(40), తోట శ్రీనివాసరావు (60) (కొప్పురావూరు) కుటుంబసభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షల నష్టపరిహారం చెక్కును ఎమ్మెల్యే నరేంద్రకుమార్ అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణకాంత్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిక్కిన భారీ చేప


మత్స్యకారుల వలలో చిక్కిన 22 కిలోల భారీచేప

దుగ్గిరాల, సెప్టెంబరు 2: దుగ్గిరాల కొమ్ముమూరు కాల్వలోకి 22 కిలోల భారీ చేప కొట్టుకువచ్చింది. రుచిలో పులస చేప తర్వాత బొచ్చకు పేరు. ఆలీనగర్ సమీపంలో మత్స్యకారుల వేసిన వలకు బొచ్చ చిక్కడంతో వారు తమ పంట పండిందంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత 20 ఏళ్లలో ఇంత పెద్దచేప కాల్వలో కనిపించడం ఇదే ప్రథమంగా చెబుతున్నారు. భారీ చేపను స్థానిక ముస్లింలు రూ.4,200 కొనుగోలు చేశారు. సముద్రంలోనూ, నదులలోనూ భారీచేపలు పడటం సహజమేనని, కాల్వల్లో నిత్యం కొట్టుకువచ్చే చేపలు ఐదు నుంచి 10 కిలోలకు మించి ఉండవని, కృష్ణానదికి వచ్చిన వరదల కారణంగా ఈ భారీచేప కొట్టుకు వచ్చినట్లు చెబుతున్నారు. దాదాపు 14 ఏళ్ల క్రితం 250 కిలోల భారీ టేకు చేప కొమ్ముమూరు కాల్వలో మత్స్యకారులు వేసిన వలలో పడిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. అయితే టేకు చేప తినేందుకు పనికి రాక పోవడంతో దీనిని తిరిగి ఓ వాహనంలో తీసుకెళ్ళి సముద్రంలో వదిలివేశారు.

రైల్వే అధికారుల నిర్లక్ష్యం.. వ్యక్తి మృతి


తోట శ్రీనివాసరావు మృతదేహం

పెదకాకాని, సెప్టెంబర్ 2: రైల్వేశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. పెదకాకాని మండలం కొప్పురావూరు గ్రామ శివారులోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఈ ఘోరం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొప్పురావూరు గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు(60) హైవేపై ఉన్న హోటల్లో పని చేసేవాడు. గత రాత్రి విధులు ముగించుకుని ఇంటికి తిరిగివెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తూ కొప్పురావూరు రైల్వే అండర్ బ్రిడ్జి కింద ఉన్న నీటిలోపడి చనిపోయాడు. రైల్వే అధికారుల కు గ్రామస్తులు ఎన్నిసార్లు చెప్పినా, ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడంతో అండర్ బ్రిడ్జిలో పూర్తిగా నీరు చేరిపోయింది. ఈ విషయా న్ని గమనించుకోకుండా శ్రీనివాసరావు రావటంతో అండర్ బ్రిడ్జిలో ఉన్న నీటిలో పడి మృతి చెందాడు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


గోపాలకృష్ణ (ఫైల్)

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 2: మండలంలోని పచ్చలతాడిపర్రు వద్ద విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. మృతుడి బంధువుల కథనం ప్రకారం పొన్నూరుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కొత్తూరు సత్యనారాయణకు పచ్చలతాడిపర్రు వద్ద సత్యనారాయణ ట్రేడర్స్ పేరుతో రైస్ మిల్లు ఉంది. ఇటీవల కురిసిన భారీవర్షాలకు రైస్‌మిల్లుకప్పుపై భారీగా వర్షపునీరు నిల్వఉంది. సత్యనారాయణ కుమారుడు గోపాలకృష్ణమూర్తి(46) ఓ ఇనుపరాడ్‌తో ఆ నీటిని మళ్లించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో విద్యుత్‌వైర్లకు చేతిలోని ఇనుపరాడ్ తగిలి విద్యుదాఘాతానికి గురై గోపాలకృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. గోపాలకృష్ణ మృతిపై రైస్ మిల్లర్ల అసోసియేషన్ నాయకులు నివాళులర్పించారు.

తెనాలి సబ్ కలెక్టర్‌గా సంజనసిన్హా


సంతకం పెడుతున్న సబ్‌కలెక్టర్ సంజనసిన్హా

తెనాలి అర్బన్, సెప్టెంబరు 2: తెనాలి సబ్‌కలెక్టర్‌గా వి.సంజనసిన్హా బాధ్యతలు తీసుకున్నారు. సబ్‌కలెక్టర్‌గా విధులు చేపట్టిన వెంటనే ఆమె వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు వెళ్లారు. వరదకు గురైన గ్రామాల్లో తీసుకోవాల్సిన చర్యలను, పునరావాస ఏర్పాట్లను ఆమె స్వయంగా పర్యవేక్షించారు. ప్రకాశం బ్యారేజీ నుంచి 10 లక్షల క్యూసెక్కులకు పైగా వరదనీరు విడుదల కావడంతో రెవెన్యూ యంత్రాంగంతో లంక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌ను బాపట్ల జిల్లా జేసీగా ప్రభుత్వం నియమించింది.

21మంది క్యాజువల్ లేబర్ ఉద్యోగుల తొలగింపు

పెదకాకాని, సెప్టెంబరు 2: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 21మంది క్యాజువల్ లేబర్ ఉద్యోగులను తొలగిస్తూ విశ్వ విద్యాలయం ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సంబంధిత ఉద్యోగులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఐదేళ్ల పాలనాకాలంలో సు మారు 150మందికి పైగా క్యాజువల్ లేబర్ ఉద్యోగులను నియ మించారు. పరిపాలన కార్యాలయాలు, విభాగాలు, పూలే అధ్యయన కేంద్రంతోపాటు ఇతర విభాగాల్లో పెద్దఎత్తున వీరి నియామకాలు జరిగాయి. వీరిలో గత వీసీ అనుచరులుగా పనిచేసినవారికి నెలకి రూ.25వేలు, రూ.22వేలు వేతనంగా నిర్ణయించి అప్పనంగా వేతనాలు ఇచ్చారు. వీరి నియామకంలో గత వైసీపీ ప్రభుత్వం పెద్దల సిఫార్సులతోపాటు విశ్వవిద్యాలయంలోని పలువురు నాయకులు, ఉద్యోగుల పైరవీలు ఉన్నట్లు సమాచారం. వీరి నియామకంలో లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వర్సిటీలో కొత్తగా ఉన్నతాధికారులు పదవీ బాధ్యతలు చేపట్టారు. వెంటనే నూతన ఉన్నతాధికారులు గత వీసీ హయాంలో జరిగిన క్యాజువల్ లేబర్ ఉద్యోగుల నియామకంపై దృష్టి సారించారు. వీరి నియామకంలో అక్రమాలు జరగడంతోపాటు వేతనాలపరంగా వర్సిటీకి భారంగా ఉందనే నిర్ణయానికి వచ్చి వీరి తొలగింపుపై నిర్ణయం తీసుకున్నారు. వర్సిటీలో పనిచేస్తున్న క్యాజువల్ లేబర్ ఉద్యోగులందరినీ పలు విడతల వారీగా తొలగించాలని వారు నిర్ణయానికి వచ్చారు. ఈ మేరకు ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి మాజీ వీసీ రాజీనామా చేసిన ఈ ఏడాది జులై ఒకటో తేదీ లోపు తీసుకున్న 21మంది క్యాజువల్ లేబర్ ఉద్యోగులను తొలగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. ఈ నిర్ణయం విశ్వవిద్యాలయంలో చర్చనీయాంశంగా మారింది.

మిర్చియార్డుకు ఏ క్షణాన్నైనా విజిలెన్స్

- డీజీకి అందిన ఫిర్యాదుపై విచారణకు ఆదేశం
- ఫైళ్లన్నింటినీ స్వాధీనం చేసుకోనున్న అధికారులు
- ఇందుకోసం సీఐ శ్రీహరికి ప్రత్యేక బాధ్యతలు

గుంటూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు ఏ క్షణానైనా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోదాలకు వచ్చే అవకాశం ఉంది. వైసీపీ ప్రభుత్వహయాంలో జరిగిన కుంభకోణాలపై విజిలెన్స్ డైరెక్టర్ జనరల్‌కు అందిన ఫిర్యాదుపై విచారణ జరపాల్సిందిగా డీజీ కార్యాలయం నుంచి ఆదేశాలు రావడంతో ఇక్కడి అధికారులు అందుకు సన్నద్ధమయ్యారు. ఆరోపణలకు సంబంధించిన ఫైళ్లను స్వాధీనం చేసుకొనే బాధ్యతని ప్రత్యేకించి ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారికి కేటాయించారు. ఒకదశలో సోమవారమే విజిలెన్స్ అధికారులు మిర్చియార్డుకు వస్తారన్న ప్రచారం జరిగింది. అయితే ఏవో అనివార్య కారణాలతో సోదాలను మంగళవారానికి వాయిదా వేసుకొన్నారు. దీంతో ఏమేమి కుంభకోణాలు బయటపడతాయోనన్న ఉత్కంఠ నెలకొంది. అలానే ఎవరెవరిపై చర్యలకు విజిలెన్స్ సిఫార్సు చేస్తుందోనన్న చర్చ కూడా జరుగుతున్నది.

మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు వారం క్రితం విజిలెన్స్ డీజీ హరీష్‌కుమార్ గుప్తాని కలిసి ఫిర్యాదు చేశారు. అలానే రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుని కూడా కలిసి కంప్లయింట్ చేశారు. యార్డులో ఏటా రూ. 16 వేల కోట్ల మిర్చి అమ్మకాలు జరుగుతాయని, ఇందుకు 1 శాతం సెస్సు లెక్కిస్తే రూ. 160 కోట్లు ఏటా రావాల్సి ఉండగా కేవలం రూ. 80 కోట్ల నుంచి రూ. 100 కోట్ల వరకే వస్తుందన్నారు. దీనికితోడు 5 శాతం జీఎస్‌టీ రావాల్సి ఉండగా ఐదేళ్లలో రూ. 4 వేల కోట్లకు బదులు రూ. 2 వేల కోట్లు మాత్రమే జమ అయిందన్నారు. యార్డులో జీరో బిజినెస్, రేట్ కటింగ్ వలన ఇలా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నదన్నారు. వైసీపీ హయాంలో కొంత మంది కమీషన్ వ్యాపారస్తులకు ఈ-కొనుగోలు యాప్ ద్వారా షాపులు కేటాయించారు. వాటికి ఎస్ఎఫ్‌టీ ద్వారా అద్దె నిర్ణయించారు. అద్దె ఎక్కువగా ఉందని వ్యాపారస్తులు విజ్ఞప్తి చేయగా భారీగానే ముడుపులు స్వీకరించి 50 శాతం అద్దె మినహాయించారని ఆరోపించారు.

2023లో కమీషన్ వ్యాపారస్తుల లైసెన్సులు సుమారు 400వరకు రెన్యువల్ చేశారు. దీనికి ఒక్కొక్క వ్యాపారి నుంచి రూ.25వేలు మొదలుకొని రూ.50వేల వరకు వసూలుచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలానే యార్డులో సుమారు 180మంది కమీషన్ వ్యాపారస్తులకు సంబంధించిన పార్టనర్‌షిప్ డీడ్‌ని మార్పుచేసి లైసెన్సులు బదిలీ చేయడానికి రూ.లక్షకు పైగా వసూలుచేశారని పేర్కొన్నారు. యార్డుకు వస్తున్న సరుకుకు రికార్డులో నమోదవుతున్న దానికి సంబంధం లేకుండా ఉందన్నారు. మార్కెట్ యార్డు సీజన్‌లో వ్యాపారస్తులకు అదనపు ప్లాట్లు కేటాయించి అద్దెతోపాటు ఫీజు టూ ఫీజు వసూలు చేశారని ఫిర్యాదు చేశారు. కల్తీ కారం యథేచ్ఛగా విక్రయిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సిఫార్సుతో కొంతమందికి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించారని, వారు ఆఫీసుకు రాకుండా జీతాలు తీసుకొంటున్నారని చెప్పారు. వైసీపీ హయాంలో రైతులకు రూ. 100 కోట్ల మేరకు వ్యాపారస్తులు ఎగ్గొట్టారన్నారు. 2019 జూన్, జూలై, ఆగస్టు నెలల్లో అయితే రూ.15 వేల కోట్ల విలువ చేసే మిర్చి క్రయవిక్రయాలు అక్రమంగా జరిగాయన్నారు. వీటన్నింటిపై విచారణ జరిపి తగిన చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ, మన్నవ సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఇప్పుడు విజిలెన్స్ విచారణకు సిద్ధమైంది.



బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

నేడు పాఠశాలలకు సెలవు

బాపట్ల, సెప్టెంబరు 2 : వరదల కారణంగా మంగళవారం కూడా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు డీఈవో కె.నారాయణరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సెలవు ప్రకటించినట్లు ఆయన పేర్కొన్నారు.

జల దిగ్బంధనంలోనే లంక గ్రామాలు

● ముంపు ప్రాంతాల్లో ముమ్మరంగా సహాయక చర్యలు

బాపట్ల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల చేసిన వరదనీరు లంక గ్రామాలను చుట్టుముట్టి జల దిగ్బంధనం చేశాయి. కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని 30 లంక గ్రామాలకు బయటి ప్రపంచంతో ఆదివారం రాత్రి నుంచే సంబంధాలు తెగిపోయాయి. లంక గ్రామాల్లోని ప్రజలు అధికారులు చెబుతున్నప్పటికీ ఈ స్థాయి వరదను ఊహించలేక ఊళ్లల్లోనే ఉండిపోయారు. ముంపులో చిక్కుకున్న ప్రజలకు తాగునీరు, ఆహారాన్ని పడవల ద్వారా అందించే కార్యక్రమం నిత్యం చేస్తున్నారు. ముంపులో చిక్కుకున్న వారిలో వృద్ధులు, గర్భిణులు, అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారు ఉంటే వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని పశువులను, గొర్రెలను ముంపుకు ముందే సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించడంతో పశునష్టాన్ని చాలా వరకు నివారించగలిగారు. వరద ముంపు కారణంగా భట్టిప్రోలు, రేపల్లె, కొల్లూరు మండలాల పరిధిలోని లంక గ్రామాల్లో 4,272 ఇళ్లు నీట మనిగినట్లు సోమవారం అధికారులు తెలిపారు. వరదల ప్రభావం వల్ల ముంపు గ్రామాల్లోని 12,943 మందిపై ప్రబావం చూపినట్లు తెలిపారు.

వరి పైరు వర్షార్పణం... రైతులు కన్నీటి పర్యంతం


జమ్ములపాలెం రోడ్డులో ఈస్ట్ డ్రెయిన్, వరి పొలాలు ఏకమై ప్రవహిస్తున్న నీరు

బాపట్ల, సెప్టెంబరు 2 : భారీవర్షాలతోపాటు ఎగువ ప్రాంతాలు నుంచి వస్తున్న వరదనీటితో వరిపొలాలు మొత్తం చెరువులను తలపించే రీతిలో ఉన్నాయి. నీటితో నిండిన పొలాలు నుండి పైరు నాలుగురోజులు గడిచిన ఇంకా బయట పడలేదు. నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలో 70శాతంకు పైగా వరినాట్లు వేశారు. ప్రతి ఒక్క ఎకరం నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నరసాయపాలెం, కంకటపాలెం, జమ్ములపాలెం, పూండ్ల, గోపాపురం, జిల్లెళ్ళమూడి, ఈతేరు, అప్పికట్ల, మూలపాలెం, భర్తీపూడి,గుడిపూడి తదితర గ్రామాలలో పైర్లపై నీరు నిలిచి ఉండి చెరువులను తలపిస్తున్నాయి. కాగా సూర్యలంక, వాడరేవు, పెనుమూడి, మోలగుంట ప్రాంతాల నుంచి 50 మోటారు బోట్లను విజయవాడ పంపించారు. విజయవాడలో ముంపు ప్రాంత ప్రజలకు సహాయ చర్యలు చేపట్టనున్నట్టు జిల్లా మత్స్య శాఖ అధికారి డాక్టర్ పి.సురేష్ తెలిపారు.

నీటిని బయటకు పంపిస్తే మొక్కలను రక్షించవచ్చు : శాస్త్రవేత్తలు

ముంపునకు గురైన పొలాలలో నీటి మొత్తాన్ని బయటకు పంపించి సస్యరక్షణ చర్యలు చేపడితే పంటలను రక్షించుకోవచ్చు అని శాస్త్రవేత్తల బృందం తెలియజేసింది. వ్యవసాయాధికారి ఆర్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండలంలోని స్టూవర్టుపురం, మురుకుండపాడు, బేతపూడి, కంకటపాలెంలోని పొలాలను సోమవారం క్షేత్ర స్థాయికి వెళ్ళి పరిశీలించారు.

ఘనంగా పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు

బాపట్ల, కర్లపాలెం, సెప్టెంబరు 2 : జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం బాపట్లలో ఘనంగా నిర్వహించారు. జనసైనికులు, అభిమానులు పురవీధులలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జీఎస్ఆర్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత గుండ్రెడ్డి శివ ఆధ్వర్యంలో కొత్తబస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన కేక్‌ను నాయకులు కట్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, పెద్ది సుబ్రహ్మణ్యం, జీవీఎల్ మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. 14వ వార్డు తుఫాన్ నగర్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన జెండాను నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ ఆవిష్కరించారు. యాజలిలో కర్లపాలెం మండల సర్పంచ్‌ల సంఘం మాజీఅధ్యక్షులు గుండ్రెడ్డి శివ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను నిర్వహించి అన్నదానం చేశారు. అలాగే రేపల్లె, చెరుకుపల్లి, చుండూరు, వేమూరు పిట్టలవానిపాలెం మండలాల్లో పవన్‌కళ్యాణ్ పుట్టిన రోజును నిర్వహించారు.

ఊహించని స్థాయిలో వరద

● జలదిగ్బంధంలో 22 లంక గ్రామాలు

● గొట్టిపాటి, ఎంపీ తెన్నేటి, ఎమ్మెల్యేలు ఆనందబాబు, నరేంద్రవర్మ పర్యటన


చిలుమూరు వద్ద అరటి తోటను ముంచిన వరద నీరు

కొల్లూరు, సెప్టెంబరు 2 : ఊహించని స్థాయిలో కృష్ణానదికి వరద పోటెత్తింది. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని 22 లంక గ్రామాలు జగదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఆయా గ్రామాల్లో 20 వేల మందికి పైగా ప్రజలు వరద నీటిలోనే బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం కృష్ణానది దిగువకు 11,43,701 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేశారు. దీంతో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాలు పూర్తిగా నీట మునిగాయి. దీంతో లంక గ్రామాల్లోని వాణిజ్య పంటలు అరటి, కంద, పసుపు, తమలపాకు, బొప్పాయి, కూరగాయ పంటలు పూర్తిగా వరద ముంపునకు గురయ్యాయి. అన్ని గ్రామాల్లోనూ గృహాల్లోకి సైతం వరద నీరు చేరడంతో కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పి తుషార్‌డూడీలు కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో పర్యటిస్తూ అధికారులను అప్రమత్తం చేసి సచివాలయ సిబ్బందిని లంక గ్రామాలకు పడవల ద్వారా తరలించి అక్కడ ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని పంపించారు. పౌర సరఫరాల శాఖ నుంచి వచ్చిన కూలీలు, ఆర్డీవో లంక గ్రామాల్లో చిక్కుకున్నారని తెలియడంతో అధికారులు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాల ద్వారా వారిని కొల్లూరు కరకట్ట వద్దకు సురక్షితంగా చేరవేశారు. వరద ఉధృతి వల్ల కరకట్టకు చిలుమూరు, ఈపూరు, దోనేపూడి, కోటిపల్లి, భట్టిప్రోలు మండలంలోని పెదపులివర్రు, ఓలేరు పల్లెపాలెం వద్ద కోతలు పడుతుండటంతో స్థానికులు, రైతులు గుర్తించి వాటిని పూడ్చే ప్రయత్నాలు చేయడంతో పాటు విషయాన్ని ఎమ్మెల్యే ఆనందబాబుకు, అధికారులకు తెలియజేయడంతో వారు కూడా స్పందించి కోత పడిన చోటులో ఇసుక బస్తాలు వేసి కోత నివారించే పనులలో నిమగ్నమయ్యారు.

లంక గ్రామాల్లో ప్రజలకు సహాయక చర్యలు అందించాలి

వరద విపత్తు వల్ల ఎటువంటి ప్రాణనష్టం జరగడానికి వీలు లేదని రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ వెంకటమురళీకి సూచించారు. సోమవారం కొల్లూరు లాకుల వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. ప్రస్తుతం 11,40,000 క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదలైందని అది 13 లక్షల క్యూసెక్కులకు పెరిగితే తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్, ఎస్పిలతో పాటు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు ఆనందబాబు, వేగేశన నరేంద్రవర్మలతో సమీక్షించారు. ఈపూరులో మహిళలు, రైతులు ఆయనను కలుసుకుని వరద వల్ల పంటలన్నీ నష్టపోయామని తమను ఆదుకోవాలని కోరగా, ముందు వరద విపత్తు నుంచి బయట పడితే దెబ్బతిన్న పంటలను అంచనా వేసి నష్టపరిహారం అందించే విధంగా ముఖ్యమంత్రితో చర్చించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

మురుగు డ్రెయిన్‌ల అభివృద్ధికి కృషి చేస్తాం

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 2 : మురుగు డ్రెయిన్‌ల అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆయన సోమవారం బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌లతో కలిసి మండలంలోని ఖాజీపాలెం, మంతేరు మురుగు డ్రైన్, అలకాపురం, అల్లూరు, పిట్టలవానిపాలెం తదితర గ్రామపంచాయతీలలో నీటమునిగిన పంటపొలాలను పరిశీలించారు. ఖాజీపాలెంలోని మంతేరు, సైబర్ డ్రైన్, అల్లూరు, పిట్టలవానిపాలెం గ్రామాలలోని డ్రెయిన్‌లను, నీటి మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, సలగల రాజశేఖర్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షులు ఎండి అప్జల్, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు లక్కంరాజు వెంకటపతిరాజు పాల్గొన్నారు.

పశువైద్యశాలలో నూతన భవనం ఏర్పాటు

కర్లపాలెం, సెప్టెంబరు 2 : మండలంలోని కర్లపాలెం పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరటంతో దానిని తొలిగించి పాతభవనం స్థానంలో నూతన భవనం నిర్మిస్తామని విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. వర్షాలు కారణంగా నీరు చేరుకున్న పశువైద్యశాలను బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మతో కలిసి మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం సందర్శించారు.

● చెరుకుపల్లి, సెప్టెంబరు 2 : భారీవర్షాలకు వరినాటిన పొలాలు పూర్తిగా దెబ్బతిని చెరువులను తలపిస్తున్నాయి. మండలంలోని కనగాలబాడవ, ఆరేపల్లిలోని పల్లపు ప్రాంత భూములు అధికంగా నీటి నిల్వలు చేరి వెదసాగు,వరివేసిన పైర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. గూడవల్లిలోని గంగోలు ఛానల్ ఉధృతంగా ప్రవహిస్తుంది.

కదలని నీరు... పూర్తిగా దెబ్బతిన్న వెదనాట్లు

వేమూరు, సెప్టెంబరు 2 : భారీ వర్షానికి చేలలో నిలిచిన నీరు కదలకుండా స్తంభించింది. సాగునీటి కాల్వల కట్టలు కూడా తెగి వెదనాట్లు వేసిన చేలలోకి ప్రవహించడం వల్ల స్తంభించిన నీరు ఎటు కదలని పరిస్థితి ఏర్పడింది. అనేక ప్రాంతాల్లో నాట్లు కొట్టుకుపోతున్నాయి. 14500 ఎకరాల్లో వెదనాట్లు వేయగా మెరక భూముల్లో నిలిచిన నీరు మాత్రమే సోమవారం నాటికి కొంత వరకు జాలువారడం వల్ల నాటిన మొక్కలు కొనలు బయటపడ్డాయి.

ముంపు భయంతో నీరు రాకుండా గోడ నిర్మాణం


వస్త్ర దుకాణం ఎదుట నిర్మించిన గోడ

రేపల్లె, సెప్టెంబరు 2 : కృష్ణా కరకట్టకు గండి పడే ప్రమాదం పొంచి ఉందన్న నేపధ్యంలో రేపల్లెలోని వ్యాపారులు ముందు జాగ్రత్తలు చేపట్టారు. షైనేని సీతారామయ్య కాంప్లెక్స్‌లోని కొంత మంది వ్యాపారులు రోడ్డు మట్టం కంటే మూడు అడుగుల ఎత్తులో ఈ గోడను పలు దుకాణదారులు నిర్మాణం చేయించుకుంటున్నారు.

పాముకాటుకు గురైన యువకుడు

కొల్లూరు, సెప్టెంబరు 2 : మండల పరిధిలోని ఆవులవారిపాలెం గ్రామంలో సారాబత్తుని అనిల్ అనే యువకుడు తన గేదేలకు మేత వేసేందుకు గడ్డివామి దగ్గరకు వెళుతుండగా సోమవారం పాముకాటుకు గురయ్యాడు. యువకుడు పాముకాటుకు గురైన విషయాన్ని తెలుసుకున్న ఎస్పి తుషార్‌డూడి వెంటనే స్పందించి ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలను అప్రమత్తం చేసి పడవ ద్వారా కొల్లూరు లాకుల వద్దకు రప్పించారు. అతనిని పోలీసు జీపులో వైద్యశాలకు తరలించారు. సరైన సమయంలో వైద్యశాలకు చికిత్స అందించడంతో యువకుడు ప్రాణాపాయం నుండి బయటపడ్డాడు.

కరకట్ట కోతకు గురి కాకుండా చర్యలు చేపట్టాలి

● అధికారులకు సూచించిన ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, సెప్టెంబరు 2 : వరద ఉధృతి వల్ల కరకట్ట కోతకు గురవుతుందని ఆయా ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆనందబాబు అధికారులకు సూచించారు. సోమవారం ఉదయం ఆయన కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో పర్యటించి వరద ఉధృతిని పరిశీలించారు. దోనేపూడి, పెదపులివర్రు, ఓలేరు పల్లెపాలెం, ఈపూరు వద్ద కరకట్ట కోతకు గురవుతున్న ప్రాంతాలను సందర్శించి ఆయా ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన కోత నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటమురళీ, ఆర్డీవో హేలాషారోన్‌కు సూచించారు. 12 గంటలకు పంపించాల్సిన భోజనం సాయంత్రం 4 గంటలు అయినా బాధితులకు అందించకపోతే రాత్రి వేళ పంపాల్సిన భోజనం ఎలా పంపుతారని వరద బాధితులను ఆదుకోవాల్సిన మీరే వారిని పస్తులు ఉంచుతారా అంటూ ఆనందబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట నియోజకవర్గ జనసేన సమన్వయకర్త ఊసా రాజేష్, టీడీపీ మండల అధ్యక్షుడు షైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ మధుసూదన ప్రసాద్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : అనగాని శివప్రసాద్


అధికారులకు సూచనలు ఇస్తున్న అనగాని శివప్రసాద్

రేపల్లె, సెప్టెంబ రు 2 : వరద ఉధృతికి కృష్ణా నది కరకట్టలు బలహీనంగా ఉన్న ప్రాంతాలను రెవెన్యూ శాఖా మం త్రి అనగాని సత్య ప్రసాద్ ఆదేశాల మేరకు సోదరుడు శివప్రసాద్ పరిశీలించి బలహీనంగా ఉన్న ప్రాంతాలలో ఇసుక బస్తాలను వేయించి కట్టలను బలపరుస్తున్నారు. వరద నీటి గ్రామాలలో చిక్కిన ప్రజలను ఎప్పటికప్పుడు తెలుసుకుని బోట్లు ద్వారా సురక్షితప్రాంతాలకు తరలించే కార్యక్రమాలు చేపట్టారు. రావిఅనంతవరం, పెనుమూడి పల్లెపాలెం, రుద్రవరం, చాట్రగడ్డ, షైనేనివారిపాలెం, మోర్తోట, అడవిపాలెం, లంకేవానిదిబ్బ దిగువ ప్రాంతాల వరకు కరకట్ట ప్రాంతాన్ని ఎప్పటికప్పుడు ఆయన పరిశీలిస్తూ అధికారులకు కరకట్ట బలహీనతను తెలుపుతూ సూచనలు ఇస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు, ప్రత్యేకాధికారులు ఆర్డీవో హేలా షారోన్, ఎంపీడీవో శివపార్వతి, తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పంతాని మురళీధరరావు, గూడపాటి శ్రీనివాసరావు, తాతా ఏడుకొండలు, పూషడపు కుమారస్వామి, పంతాని సాయికుమార్, గుడారంకయ్య పాల్గొన్నారు.

ప్రజలకు సక్రమంగా సౌకర్యాలు కల్పించాలి : కలెక్టర్

వరద ఉధృతికి గ్రామాలలో ఉండలేని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించటం జరిగిందని కలెక్టర్ జే.వెంకట మురళి అన్నారు. సోమవారం వరద ఉధృతిని పరిశీలించి కరకట్ట పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా మోటారుబైక్‌పై కరకట్టల వెంట తిరిగి పల్లంగా ఉన్న కట్టను పరిశీలించారు. రేపల్లెలోని పునరావాస కేంద్రాలు ఆంధ్రరత్న మున్సిపల్ ఉన్నత పాఠశాల, ట్రిబుల్ ఎక్స్ హైస్కూల్, లాల్‌బహదూర్ పాఠశాల, నైట్‌షెల్టర్,మున్సిపల్ హైస్కూలలో శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు.

వరదలో చిక్కుకున్న మూగజీవాలు

వరద ఉధృతి అధికంగా రావటంతో ఎటు వెళ్ళాలో తెలియక మూగజీవాలు వంతెనను నివాసంగా చూసుకుని నీటిలోనే నిలబడి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే సగం నీటిలో ఎటు నడవలేక ఈత వేయలేక వంతెన కింద నిలబడి ఊసూరుమంటున్నాయి.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : జేసీ


కరకట్ట పనులను పరిశీలిస్తున్న జేసీ ప్రఖర్‌జైన్

చెరుకుపల్లి, సెప్టెంబరు 2 : కరకట్ట బలహీనంగా ఉన్న ప్రతి ప్రాంతాలను గుర్తించి బలోపేతం చేయటం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ అన్నారు. సోమవారం రావిఅనంతరం వద్ద కరకట్ట పల్లపు ప్రాంతాన్ని గుర్తించి ఇసుక మూటలతో కట్టను బలోపేతం చేస్తున్నామన్నారు. రావిఅనంతవరం వద్ద కట్టపైకి నీరు చేరుతుండటాన్ని గమనించి అప్పటికప్పుడు ఇసుక మూటలను కట్టించి కరకట్ట మీదకు నీరు రాకుండా చర్యలు తీసుకున్నారు.


కొల్లిపర మండలం బొమ్మువానిపాలెంలో గృహల చుట్టూ చేరిన వరదనీరు

లంక గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి

కలెక్టర్ నాగలక్ష్మి

కొల్లిపర, సెప్టెంబరు 2: కృష్ణానదికి వరద ఉధృతి మరింత పెరుగుతుందని లంక గ్రామాల ప్రజలను తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బొమ్మువానిపాలెం వరద ముంపునకు గురికావటంతో సబ్‌కలెక్టర్ సంజనా సింహాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ వరద ముంపు ప్రాంతాల్లో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. లంక గ్రామాల ప్రజలు అధికారులకు సహకరించాలన్నారు. అనంతరం హనుమాన్‌పాలెంలోని పునరావాసకేంద్రాన్ని తనిఖీ చేశారు. వసతులపై ఆరాతీశారు. అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి అన్నవరంలంకలో వరద ముంపుకు గురైన పంట పొలాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ భార్గవ్, తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న వరద ఉధృతి

కొల్లిపర, సెప్టెంబరు 2: కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చుతోంది. గంట, గంటకు వరద ఉధృతి పెరగటంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు 11లక్షల క్యూసెక్కుల పైగా వరదనీటిని విడుదల చేయటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మండలంలోని కొత్తూరులంక, అన్నవరంలంక, బొమ్మువానిపాలెం గ్రామాల్లోకి వరదనీరు చేరుకోవటంతో గ్రామాల ప్రజలను, పశువులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మండల పరిధిలోని బొమ్మువానిపాలెంలో నిల్వపెట్టిన మొక్కజొన్నలను పడవ ద్వారా రైతులు సురక్షిత ప్రాంతానికి తరలించి రక్షించుకున్నారు. కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చటంతో వాణిజ్యపంటలు పూర్తిగా నీటమునగటంతో రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. ఎక్కడ చూసినా పంట పొలాల్లో 8 అడుగులపైగా వరద నీరు ప్రవహించడంతో లంక భూముల్లో వేసిన వాణిజ్య పంటలు నదిలో కలిసిపోయాయి. వేలాది రూపాయలతో పెట్టుబడి పెట్టి వేసిన పంటలు కళ్ల ముందే నీటిలో తేలియాడుతుండటంతో రైతులు ఆందోళనకుగురవుతున్నారు.

లంకగ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఆలపాటి

కొల్లిపర: కృష్ణానదికి వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బొమ్మువానిపాలెం, కొల్లిపర, పిడపర్తిపాలెం, మున్నంగి, వల్లభాపురం గ్రామాల్లో పర్యటించి వరద ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కృష్ణానదికి 12లక్షల క్యూసెక్కుల వరకు వరద నీరువచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, టీడీపీ తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, నాయకులు జి.గోవర్ధనరెడ్డి, బి.యోగానందచటర్జీ ఉన్నారు.


బొమ్మువానిపాలెం సమీపంలో వరద ఉధృతిని పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల, కలెక్టర్ నాగలక్ష్మి, మాజీ మంత్రి ఆలపాటి

● తెనాలి రూరల్: వరద ఉధృతికి బుర్రిపాలెం ఎస్టీకాలనీలోకి వరద నీరు చేరడంతో వారిని అదేగ్రామంలో హైస్కూల్‌లో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆ కేంద్రంలో ఉన్న కాలనీ వాసులను సోమవారం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ భారీ వర్షానికి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుందని, నదీ పరివాహక ప్రాంత ప్రజలకు ఎక్కడా కూడా ప్రాణ నష్టం జరగకుండా ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనుక్షణం శ్రమిస్తున్నాడని అన్నారు. చంద్రబాబు ముందుచూపుతోనే ప్రాణ నష్టం జరగకుండా నివారించగలిగామన్నారు. గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షడు కేసన కోటేశ్వరరావు. తహసీల్దార్ గోపాలకృష్ణ, పలుశాఖల అధికారులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: పట్టణంలోని పలు కాలనీల్లో ఇటీవల కురిసిన వర్షపు నీరు నిలిచిపోయింది. ఖాళీ స్థలాలు, పల్లపు ప్రాంతాల్లో నీటి నిల్వల కారణంగా దోమలు వృద్ధి చెందుతున్నాయి. రోజుల తరబడి నీరు ఉండటం వల్ల దుర్గంధంతో పాటు పాముల బెడద ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు పట్టణంలో లోతట్టు ప్రాంతాలు, ఖాళీ స్థలాలు గుర్తించి నిలిచి ఉన్న నీటిని ఇంజన్లతో తరలించాలని కోరుతున్నారు.

డీవీసీ కాలనీని వీడని వరద ముప్పు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు2: పొన్నూరు పట్టణంలోని డివిసి కాలనీని వరద ముప్పు వీడలేదు. డీవిసి కాలనీ పొన్నూరు పట్టణంలోని టీబీ డ్రెయిన్ చెంతనే ఉంది. అయితే ప్రస్తుతం భారీవర్షాల కారణంగా తుంగభద్ర డ్రెయిన్ ఉధృత్తంగా పొంగి ప్రవహిస్తోంది. డీవీసీ కాలనీలో ముంపు బారినపడిన గృహాల సమాచారం తెలుసుకున్న ప్రజా ప్రతినిధులు, పురపాలక సంఘం అధికారులు స్పందించి పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయటంతోపాటు 100మందికి పైగా స్థానికులను పునరావాస కేంద్రానికి తరలాలని ఆదేశించారు. పునరావాస కేంద్రంలో ఆహారం అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. గృహాలో విలువైన వస్తు సామగ్రి వరద పాలవటంతోపాటు చోరుల పాలౌతుందేమోని భయంతోనే గృహాలు వీడేందుకు ఆసక్తి చూపటం లేదని అధికారులు తెలిపారు.

వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు: ఎమ్మెల్యే


డీవీసీ కాలనీలో వరద నీటిలోనే పర్యటిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తదితరులు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 2: పట్టణంలోని డీవీసీ కాలనీ వరద ప్రాంతాలో ముమ్మర సహాయక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. సోమవారం డీవీసీ కాలనీలో వరద ముంపు బారిన పడిన గృహాలను ఎమ్మెల్యే సందర్శించారు. అలాగే వరదకు కారణమైన ఉధృతంగా ప్రవహిస్తున్న టీబీ డ్రెయిన్‌ను పరిశీలించారు. టీబీ డ్రెయిన్ కట్టలు పొంగి కాలనీలోకి వరదనీరు రాకుండా ఇసుక బస్తాలతో కట్టలను బలపరచాలని ఆదేశించారు. అలాగే మోటార్ల ద్వారా నీటిని తోడి పోయాలని సూచించారు. నిర్వాసితులకు ఆహారం, పరిశుభ్రమైన తాగు నీరు పునరావాస కేంద్రాలో అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ 15 ఏళ్ల తర్వాత అత్యధిక వర్షపాతం నమోదైందన్నారు. గత ఐదు సంవత్సరాల కాలంలో అప్పటి పాలకులు కాల్వల అభివృద్ధిపై నిర్లక్ష్యం వహించటంతోనే ప్రస్తుతం ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితులో రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కాల్వ కట్టలు తెగి ఊరిపైకి వరద రాకుండా ఉండేందుకు యువత రాత్రింబవళ్లు పనిచేసి ఇసుక బస్తాలను కట్టలకు అడ్డుగ పెట్టి ఊరిని కాపాడుకున్న నంబూరులో యువతను ప్రత్యేకంగా అభినందించారు.

● చేబ్రోలు: భారీ వర్షాలకు సర్వం కోల్పోయిన బాధితుల కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. చేబ్రోలు పాతరెడ్డిపాలెం గ్రామంలో కాల్వ కట్ట తెగి ఇళ్లలోకి నీరు చేరిన 16 కుటుంబాలకు సోమవారం సాయం అందచేశారు. ప్రెసిడెన్సీ స్కూల్ అధినేత వాసిరెడ్డి బన్‌బాబు సహకారంతో ఇళ్లు కోల్పోయిన ముగ్గురు బాధితులకు రూ.5వేల చొప్పున నగదు, 16 కుటుంబాలకు 25 కేజీల చొప్పున బియ్యం ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ చేతల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు షైలా వెంకటరామరాజు, అనంత లక్ష్మీ నారాయణ, చేబ్రోలు జనసేన అధ్యక్షుడు చందు శ్రీరాములు, మాజీ ఎంపీపీ ఖాదర్‌బాష పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే పవన్ ఆశయం

● పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్


మొక్కలు నాటుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్ తదితరులు

తెనాలి రూరల్, సెప్టెంబరు 2: జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినం రాష్ట్ర వ్యాప్తంగా ఆహ్లాదరకవాతావరణం నెలకొల్పి భావితరాలకు మంచిఆరోగ్యకరమైన సమాజాన్ని నెలకొల్పడమే ఆశయంగా పెట్టుకున్నారని అందుకు అనుగుణంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి, జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని మంత్రి మనోహర్ కూటమి శ్రేణులతో కలిసి పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, గుమ్మడి రమేష్, తోటకూర వెంకటరమణారావు, కనగాలనాగభూషణం, బండారు రవికాంత్, హరిదాసుగౌరీశంకర్ పలువురు కౌన్సిర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పలుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి, మారీసుపేట: పట్టణ పరిసర గ్రామాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక సుల్తానాబాదులో సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను సుల్తానాబాదు వడ్డెర కాలనీ యూత్ సభ్యులు అనీల్, వెంకట్, వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ నాయకులు, గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, అంగలకుదురు ఉప సర్పంచ్ కనగాల నాగభూషణంలు పాల్గొన్నారు. కార్యక్రమంలో అనీల్, బిట్ర యుగంధర్, సిద్ధాంతి శ్రీనివాసరావు, మహేష్‌నాయక్, హనుమంత్ నాయక్, కళ్యాణ్ నాయక్, వెంకటేష్, వెంకట్రావు, సత్యనారాయణ, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి రూరల్: మండలంలోని సంగంజాగర్లమూడిలో గ్రామసర్పంచ్ పాలడుగు జయనాగలక్ష్మి దంపతులు పవన్ కల్యాణ్ జన్మదిన కేక్‌ను కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పలువురు కూటమి శ్రేణులు పాల్గొన్నారు. మండలంలోని కొలకలూరులో 30 మంది రక్తదానం చేసినట్లు ఆ పార్టీ నాయకుడు నరేంద్ర తెలిపారు.

పవన్ జన్మదిన వేడుకల్లో వైసీపీ కౌన్సిలర్లు

తెనాలిలో డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకల్లో మంత్రి మనోహర్‌తో కలిసి వైసీపీ కౌన్సిలర్లు పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. సోమవారం పవన్ జన్మదినం సందర్భంగా పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ కార్యక్రమానికి పలువురు వైసీపీ కౌన్సిలర్లు, నాయకులు హాజరై మంత్రి మనోహర్‌తో కలిసి మొక్కలు నాటారు. ఐతే దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పిలుపునిచ్చినా పవన్‌కల్యాణ్ మొక్కలు నాటే కార్యక్రమానికి ప్రాధాన్యత ఇవ్వడం విశేషం.

బుర్రిపాలెం పునరావాసకేంద్రంలో వైద్యశిబిరం

తెనాలి రూరల్, సెప్టెంబరు 02: మండలంలోని బుర్రిపాలెం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో సంగంజాగర్లమూడి పీహెచ్‌సీ వైద్యులు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న ఎస్టీ కాలనీ ప్రజలకు డాక్టర్ షేక్ హనీఫ్ వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించారు.

వర్సిటీ ఎదుట ఘనంగా హరికృష్ణ జయంతి


పెదకాకాని, సెప్టెంబరు 2: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట మాజీ మంత్రి నందమూరి హరికృష్ణ 68వ జయంతిని టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు నితీష్ యాదవ్ మాట్లాడుతూ నందమూరి హరికృష్ణ చైతన్య రథసారథిగాను, రాజకీయ నాయకుడిగాను రాణించారన్నారు. ఎన్నో సవాళ్లు, ఆటుపోట్లు వచ్చినా పార్టీకి అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో జనసేన విద్యార్థి సంఘం అధ్యక్షుడు జగదీష్, ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు పాలం నాసరయ్య, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మృతురాలికి ఎమ్మెల్యే నివాళి

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 2: పట్టణంలోని 12వ వార్డుకు చెందిన కొత్తపల్లి ఉదయలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. ఉదయలక్ష్మి మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ నిడుబ్రోలు వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. మృతురాలి భర్త లెనిన్ రాజన్‌ను పరామర్శించారు.

గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్స్‌ను తీర్చిదిద్దుతాం

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి


విద్యార్థులతో మాట్లాడుతున్న గిరిజనశాఖ మంత్రి సంధ్యారాణి, పక్కన ఆలపాటి

తెనాలి రూరల్, సెప్టెంబరు 1: గిరిజన సంక్షేమశాఖ గురుకుల హాస్టల్స్‌ను తీర్చిదిద్దుతామని రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి సంధ్యారాణి హామీ ఇచ్చారు. భారీ వర్షానికి తెనాలి చంద్రబాబు నాయుడు కాలనీలోని గిరిజన సంక్షేమశాఖ గురుకుల స్కూల్, హాస్టల్‌లోకి నీరు నిలిచి పోయాయి. సోమవారం ఆ హాస్టల్, స్కూల్‌ను రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి సంధ్యారాణి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ స్కూల్స్‌లో విద్యార్థులకు మంచి సౌకర్యాలు కల్పించి వారికి నాణ్యమైన విద్యనందించడంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం బాధ్యతగా మెలగకపోవడంతోనే నేడు విద్యార్థులు పునరావాస కేంద్రాల్లో తలదాచుకునే పరిస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. గదిలో ఉన్న నీటిని అందులోనే నానుతన్న విద్యార్థుల పాఠ్యపుస్తకాలు, ఇతర వస్తువులను చూసి ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్వోవాటర్‌ప్లాంట్, బాత్రూమ్‌లు, పరిసరాలు, వంట గది వంటివాటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆర్వోప్లాంట్ పనిచేయకపోవడంతో నూతన ప్లాంట్ ఏర్పాటుకు ఆదేశాలిచ్చారు. అనంతరం పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న విద్యార్థుల వద్దకు వెళ్లి వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరాతీశారు. వర్షంకారణంగా 140 మంది విద్యార్థినులు ఉన్న హాస్టల్‌లోకి నీరు చేరటంపై ఎంతో ఆవేదనకు గురయ్యానని చెప్పారు. స్కూల్‌లో సైన్స్ ఇతర సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయుల కొరత ఉందని అక్కడ విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. తెనాలి చంద్రబాబు నాయుడుకాలనీలో హాస్టల్ నూతన భవననిర్మాణానికి స్థలాన్ని సేకరించేలా అధికారులకు ఆదేశాలివ్వడం జరిగిందని రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి సంధ్యారాణి చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యం, మంచి విద్య రెండూ కూటమి ప్రభుత్వానికి ముఖ్యమైనవేనని త్వరలోనే తెనాలి హాస్టల్ సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించడం జరుగుతుందని మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు. గురుకుల సెక్రటరీ సదాభార్గవి, జాయింట్ సెక్రటరీ రమణమూర్తి, ఓఎస్డీ ఎంవి రాధకృష్ణమూర్తి, తహసీల్దార్ గోపాలకృష్ణ, టీడీపీ ఎస్టీసెల్ అధ్యక్షుడు ధారా నాయక్, టీడీపీ నాయకులు, కారకర్తలు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్ర

పెదకాకాని, సెప్టెంబరు 2: పెదకాకాని సుందరయ్య కాలనీ, దర్గా ఏరియాలో ఇండ్లలోకి వర్షపునీరు రాగా, లూధర్‌గిరి ఏరియాలో వున్న స్కూల్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటుచేశారు. సోమవారం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో పునరావాస కేంద్రంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నరేంద్రకుమార్, టీడీపీ, జనసేన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వరిపైర్లను పరిశీలించిన వ్యవసాయశాఖ అధికారులు

తెనాలి రూరల్, సెప్టెంబరు 2: భారీ వర్షాలకు నీటమునిగిన వరిపైర్లను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. మండలంలోని పెదరావూరు, హాఫ్‌పేట, సంగంజాగర్లమూడి గ్రామాల్లో ఏడీఏ ఉషారాణి, మండల వ్యవసాయాధికారి ప్రేమసాగర్ ప్రేమసాగర్, లాం శాస్త్రవేత్త డాక్టర్ గోపాలస్వామి, వెంకటలక్ష్మి, డాక్టర్ ఉషారాణిలు కలిసి పంటలను పరిశీలించారు. రైతులకు సాధ్యమైనంత త్వరగా పంట పొలాల్లోని నీరు బయటకు వెళ్లే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నీరు బయటకు పంపి పొలాల్లో యూరియా లేదా డీఏపీ వంటివి చిమ్మాలని కోరారు. పైర్లు తెగుళ్లబారిన పడకుండా కార్బెండాజిమ్‌ను పిచికారి చేయాలన్నారు. మంత్రి ఆదేశాలతో డ్రెయిన్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని ఇరిగేషన్ అధికారులు చేపట్టారు. దీంతో కాలువలో నీరు పారుదల వేగం పెరిగి పంటపొలాల్లో నీరు బయటకు వెళుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకి నుంచి విజయవాడకు ఆహార ప్యాకెట్లు

మంత్రి గొట్టిపాటి రవికుమార్



వాహనాలను పంపిస్తున్న టీడీపీ శ్రేణులు

అద్దంకి, సెప్టెంబరు 2 : విజయవాడ నగరంలోని వరదబాధితులకు అవసరమైన భోజనాన్ని విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో అద్దంకిలో తయారు చేయించి సోమవారం పంపించారు. అద్దంకి పట్టణంలోని నాగులపాడు రోడ్డులో కామేపల్లి కల్యాణ మండపంలో ప్రత్యేకంగా భోజనాలు తయారు చేయించి ప్యాకెట్లు చేసి 6 ప్రత్యేక వాహనాలలో పంపించారు. సోమవారం రాత్రికి 25వేల మందికి పంపగా, మంగళవారం ఉదయం 20 వేల మందికి, సాయంత్రానికి 20వేల మందికి భోజనాలను పంపించేలా తయారు వండిస్తున్నారు. మంత్రి రవికుమార్ ఆదేశాలతో టీడీపీ శ్రేణులు భోజనాల తయారీ, విజయవాడకు పంపే ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సోమవారం సాయంత్రం భోజనాలను విజయవాడకు పంపుతున్న వాహనాల వద్ద అద్దంకి టీడీపీ నేతలు చిన్ని శ్రీనివాసరావు, కరి పరమేష్, కుందారపు రామారావు, అశోక్, శ్రీనివాసరావు, మన్నెం ఏడుకొండలు, రమేష్, మురళీమోహన్‌దాస్, కౌన్సిలర్లు అత్తులూరి రమేష్, నాగరాజు, రజని, విజయలక్ష్మి, తిరుపతమ్మ ఉన్నారు.

బోల్తా పడిన లగేజీ ఆటో

17 మందికి గాయాలు



బోల్తా పడిన మినీ వ్యాన్

చినగంజాం, సెప్టెంబరు 2 : అదుపు తప్పి లగేజీ ఆటో బోల్తా పడడంతో 17 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన కడవకుదురు గ్రామ సమీపంలోని ఎం శ్రీ రెస్టారెంట్ సమీపం 216వ నెంబరు జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని కోడూరివారిపాలేనికి చెందిన 22 మంది మండల కేంద్రమైన నాగాయలంక గ్రామంలో చెరువులలో రొయ్యలు పట్టేందుకు లగేజీ ఆటోలో బయలుదేరారు. వేగంగా వెళ్తుండగా స్టీరింగ్ కంట్రోల్ కాకపోవడంతో రెస్టారెంట్ సమీపంలోని జాతీయ రహదారిపై అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న 22 మందిలో 17 మందికి తీవ్రగాయాలు కాగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108లో చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వీరిలో కోడూరి శ్రీనివాసరావు, కోడూరి ఆంజనేయులు, కోడూరి కోటయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ఆసుపత్రికి తరలించారు. తీవ్రగాయాలైన కావేరి పోలయ్య, జాలరామ్, ఆక్కంగారి జయరామ్, కే.శ్రీను, చెన్నంగారి రాములు, నాగరాజు, శ్రీను, పి.రాంబాబు, కాటం శ్రీను, కే.నాగరాజు, పి.జాలయ్య కోడూరి శ్రీను, వాయిల వెంకటేశ్వర్లు, ఎం.రాఘవులు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ శీలం రమేష్ పరిశీలించారు. కోడూరి శ్రీను ఫిర్యాదు మేరకు స్టేషన్ హౌస్ ఆఫీసర్ పి.పేరిలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య పరామర్శించారు.

విషజ్వరాలు వ్యాప్తి చెందకుండా చర్యలు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఐవో వెంకటేశ్వరరావు

బల్లికురవ, సెప్టెంబరు 2 : గ్రామాలలో విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఇంటింటి సర్వేతో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్య డీఐవో వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన అదుపులోకి రాని విషజ్వరాలు వార్తపై జిల్లా అధికారులు స్పందించారు. ముక్తేశ్వరంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని డీఐవో వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఇంటింటికీ తిరిగి సర్వే చేయడంతో పాటు జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించాలన్నారు. వ్యక్తి గత పరిశుభ్రత పాటించేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రోడ్ల వెంబడి చెత్తను తొలగించాలన్నారు. దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయించాలన్నారు. జ్వరపీడితుల వివరాలు సేకరించి ఎప్పటికప్పుడు పరీక్షించాలన్నారు. వైద్యాధికారి మమత, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పట్టుబడిన సముద్రపు వానపాములు

ఫారెస్టు అధికారులకు అప్పగింత



ప్యాకింగ్ చేసిన వానపాములు

ఉలవపాడు, సెప్టెంబరు 2 : రొయ్యల ఉత్పత్తి కేంద్రాల్లో ఉపయోగించే వానపాములు, సముద్రపు ఎర్రల(బ్లడ్ వామ్స్)ను అక్రమంగా తరలిస్తుండగా సోమవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై అంకమ్మ కథనం మేరకు సూళ్లూరుపేట నుంచి ఒంగోలుకు 30 కిలోల వానపాములను కారులో తరలిస్తుండగా ఉలవపాడు జాతీయ రహదారిపై తనిఖీలు చేస్తుండగా పట్టుబడినట్లు ఆయన తెలిపారు. వీటిని రొయ్యల హేచరీస్‌లో ఫీడింగ్ కోసం వాడతారని, పట్టుబడిన వాటి విలువ సుమారు రూ. 50,000 ఉంటుందని తెలిపారు. వీటిని సూళ్లూరుపేట ఫారెస్టు డివిజన్ రేంజర్ టీ నరసింహారావుకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

తెరిపిచ్చిన వాన

- ఊరట చెందిన జనం
- సాగు, తాగునీటి వనరుల్లో జలకళ
- కళకళలాడుతున్న పైర్లు
- సాగుకు ఉపక్రమిస్తున్న రైతాంగం
- అక్కడక్కడా స్వల్ప నష్టాలు
- ఛిద్రమైన రోడ్డుతో జనం అవస్థలు
- తుఫాన్ ఎఫెక్ట్ మనకు లేదు: కలెక్టర్
- కృష్ణాలో వరద సహాయక చర్యలలో యంత్రాంగం
- భారీగా ఆహారం, సరుకులు, బోట్లు తరలింపు

కోస్తాంధ్రను వణికించిన వానలు ఎట్టకేలకు తెరిపిచ్చాయి. వాయుగుండం ప్రభావంతో జిల్లాలో నాలుగురోజుల పాటు కురిసిన జల్లులతో అక్కడక్కడా కొద్దిపాటి నష్టాలు జరిగాయి. అదే సమయంలో సాగునీటి వనరులు జలకళను సంతరించుకున్నాయి. సాగులో ఉన్న పైర్లకు మేలు చేకూరింది. అలాగే మిగతా పంటల సాగుకు ఊతం లభించడంతో రైతులు పొలం పనులకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రజానీకం ఊరట చెంది రోజువారీ పనుల్లో నిమగ్నమయ్యారు. కాగా పారిశుధ్యం అధ్వానంగా మారింది. అలాగే రహదారులు దెబ్బతిన్నాయి. ఇక వరదలతో అతలాకుతలమైన ఎన్టీఆర్ జిల్లాను ఆదుకునేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. సహాయక చర్యలలో నిమగ్నమైంది. బాధితుల కోసం భారీ ఎత్తున ఆహారపదార్థాలను సిద్ధం చేసి ప్రత్యేక వాహనాల్లో తరలిస్తోంది.

ఒంగోలు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంచుమించు నాలుగు రోజులపాటు కురిసిన వర్షాలు సోమవారం తెరిపిచ్చాయి. ముసురుపట్టి పడిన వర్షంతో తీవ్ర అవస్థలు పడ్డ ప్రజానీకం ఎట్టకేలకు రోజువారి పనులలో నిమగ్నయ్యారు. మూడు, నాలుగు రోజుల్లో జిల్లాలో సగటున 93.2 మి.మీ వర్షపాతం నమోదైంది. దాదాపు సగం మండలాల్లో 100 మి.మీ కన్నా అధికంగా కురిసింది. దీంతో జిల్లాలోని పలుప్రాంతాల్లో ప్రత్యేకించి పశ్చిమప్రాంతంలో సాగు, తాగునీటి వనరులుగా ఉండే గుండ్లకమ్మ, సగిలేరు, ఉప్పుటేరు, తీగలేరు వంటి వాటితోపాటు పలు వాగులు, వంకలు, చెరువుల్లోకి భారీగా వర్షపు నీరు చేరి జలకళను సంతరించుకున్నాయి. కంభం చెరువుతోపాటు పశ్చిమ ప్రాంతంలోని అనేక చెరువులకు నీరు చేరింది. దీంతో ఆ ప్రాంతంలో భూగర్భజలం కూడా పెరగనుంది. తూర్పుప్రాంతంలో ఆ స్థాయిలో నీరు చేరకపోయినా సాగుకు ఉపకరించేలా వర్షాలు పడ్డాయి. దీంతో జిల్లావ్యాప్తంగా రైతులు పంటల సాగుకు ఉపక్రమిస్తున్నారు.

పెరగనున్న సాగు

ఇప్పటికే పొలంలో ఉన్న పైర్లు తాజా వర్షాలతో కళకళలాడుతున్నాయి. తదుపరి విస్తారంగా పంటల సాగును రైతులు చేపట్టే అవకాశం ఏర్పడింది. భారీ వర్షాలతో ఎగువ నుంచి వస్తున్న నీటితో గుండ్లకమ్మ ప్రాజెక్టు కూడా జలకళను సంతరించుకుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 1.10 టీఎంసీల నీరు ఉండగా ఎగువ నుంచి వస్తున్న ఏడు వేల క్యూసెక్కుల నీటిని నాలుగు గేట్లు ఎత్తి కిందకు వదిలేన్నారు. కాగా తాజా వర్షాలతో అక్కడక్కడ పంటలకు స్వల్ప నష్టం జరిగినట్లు తెలుస్తోంది. కంభం ప్రాంతంలో అరటితోటలు దెబ్బతినగా ఇతర ప్రాంతాల్లో సుమారు మూడున్నర వేల ఎకరాలలో నువ్వు, సజ్జ, కొర్ర వంటి పైర్లు దెబ్బతిన్నాయి.

దెబ్బతిన్న రహదారులు



మార్కాపురంలో వాన నీటిలో పత్తి చేను

జిల్లాలో ఈదురుగాలుల వల్ల అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు పడిపోయి కొంత నష్టం జరగ్గా రోడ్ల పరిస్థితి మాత్రం దారుణంగా ఉంది. గత ఐదేళ్లలో వైసీపీ పాలనలో రోడ్ల నిర్వహణను పట్టించుకున్న పాపాన పోకపోవడంతో ఆర్అండ్‌బీ, పీఆర్ ఇతర పలు రోడ్లు గోతులమయంగా మారాయి. అలాంటి వాటిలో ప్రస్తుతం వర్షపు నీరు చేరి అధ్వానంగా తయారవ్వగా గ్రామీణ రోడ్లు మరింత దారుణంగా ఉండి ప్రజానీకం అవస్థలు పడుతున్నారు. రోడ్లు, డ్రైన్లు ఏకమై మురుగు నీరంతా రోడ్లపైకి రావడంతో పారిశుధ్య పరిస్థితి కూడా చాలా ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా ఉంది.

జిల్లాలో వాయుగుండం ప్రభావం తక్కువే



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

- మార్కాపురం డివిజన్‌లో ఎక్కువ వర్షపాతం నమోదు
- జిల్లా నుంచి ఎన్టీఆర్ జిల్లాకు 25వేల ఆహార ప్యాకెట్లు
- సహాయక చర్యలలో జేసీతోపాటు పలుశాఖల అధికారులు
- కలెక్టర్ అన్సారియా వెల్లడి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 2 : 'తుఫాన్ ప్రభావం జిల్లాలో తక్కువే. మార్కాపురం డివిజన్‌లో మాత్రం ఎక్కువ వర్షపాతం నమోదైంది. దాంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నందున, ప్రజలు అటువైపు వెళ్లకుండా అవసరమైన బందోబస్తును చేపట్టాము' అని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. కలెక్టరేట్‌లోని మినీ హాలులో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం జిల్లాపై తక్కువగా ఉన్నా మార్కాపురం డివిజన్‌లో మాత్రం అధికంగా వర్షం పడిందన్నారు. ఎటువంటి నష్టాలు జరగకుండా రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులను సమన్వయం చేసి అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. వర్షాలకు జిల్లాలోని రాచర్ల, సీఎస్‌పురం మండలాలతోపాటు పలు ప్రాంతాల్లో కొంతమేర పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న కృష్ణా జిల్లాకు సహాయక చర్యల నిమిత్తం కొత్తపట్నం, సింగరాయకొండ ప్రాంతాల నుంచి 35 బోట్లను పంపించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఒంగోలు నుంచి ఎన్టీఆర్ జిల్లాకు 25 వేల భోజన ప్యాకెట్లు, మంచినీళ్ల బాటిల్స్, బిస్కెట్లు, మజ్జిగ పంపామని వివరించారు. రాత్రికి మరో 50వేల భోజన ప్యాకెట్లను పంపేందుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లా నుంచి సహాయక చర్యల్లో భాగంగా జేసీతోపాటు పలువురు అధికారులు, రెవెన్యూ సిబ్బందిని పంపమని అన్నారు. తుఫాన్ బాధితులకు సహాయం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు.

మేము సైతం..

- వరద బాధితుల కోసం కదిలిన యంత్రాంగం
- ఒంగోలు నుంచి ఎన్టీఆర్ జిల్లాకు ఆహారం
- ప్రత్యేక వాహనాల్లో తరలింపు
- 75వేల ఆహార ప్యాకెట్లు, ఇతర నిత్యావసరాలు
- లారీలలో తరలిన 35 బోట్లు
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ అన్సారియా
- ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా అధికారుల చర్యలు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 2: తుఫాన్ ప్రభావంతో అతలాకుతలమైన ఎన్టీఆర్ జిల్లాకు అవసరమైన ఆహారం, మంచినీళ్ల బాటిళ్లు, మజ్జిగ, ఇతర నిత్యావసరాలను పంపేందుకు అవసరమైన చర్యలలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. సోమవారం మధ్యాహ్నం ఒక విడత వాహనాలలో పంపగా, రాత్రికి కూడా తరలించింది ఎన్టీఆర్ జిల్లాలో గత మూడు రోజుల నుంచి వరద ముంచెత్తుతుంటడంతో సమీపంలో ఉన్న ప్రకాశం జిల్లా నుంచి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు చేపట్టారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా నేతృత్వంలో రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న బచ్చల బాలయ్య కళ్యాణ మండపంలో అందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. సోమవారం ఉదయం పది గంటలకే ఎన్టీఆర్ జిల్లాకు 25వేల ఆహార ప్యాకెట్లతోపాటు వాటర్ బాటిళ్లు, మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లను ప్రత్యేక వాహనాల్లో తరలించారు. రాత్రికి మరో 50వేల ఆహార ప్యాకెట్లను పంపేందుకు అధికార యంత్రాంగం అక్కడ చర్యలు చేపట్టారు. భోజనాలు వండిన తర్వాత అక్కడ ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వాహనాల్లో ఎన్టీఆర్ జిల్లాకు తరలించారు. మరోవైపు ఆహారంతోపాటు వరదల నుంచి ప్రజల నుంచి రక్షించేందుకు 35 బోట్లను కూడా తరలించారు. కొత్తపట్నం, సింగరాయకొండ సముద్రతీర ప్రాంతాల నుంచి ఈ బోట్లను ప్రత్యేక వాహనాల్లో తరలించారు. మరోవైపు ముంపు ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలను చేపట్టేందుకు జిల్లా నుంచి అధికారులను పంపారు. జేసీ ఆర్.గోపాలకృష్ణతోపాటు పలుశాఖల అధికారులు, రెవెన్యూ యంత్రాంగాన్ని ఎన్టీఆర్ జిల్లాకు పంపారు. వారంతా ముంపు ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. మరోవైపు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ముంపు బాధితుల కోసం బ్రెడ్లు లాంటి నిల్వ ఉండే ఆహార పదార్థాలను కూడా ప్రత్యేక వాహనాల్లో తరలించారు. కాగా బచ్చల బాలయ్య కళ్యాణ మండపంలో ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా పలు సూచనలు చేశారు.

పంటల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

డీఐవో శ్రీనివాసులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 2 : అధిక వర్షాలతో సాగులో ఉన్న వివిధ రకాల పైర్లలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కృషి విజ్ఞాన్ కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.శ్రీనివాసులులు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. వరి, మొక్కజొన్న, కంది, మిరప, పత్తి, మినుము, నువ్వు, వేరుశనగ తదితర రకాల పంటలు దెబ్బతినకుండా ఎప్పటికప్పుడు చూసుకోవాలని కోరారు. పెరుగుదల దశలో వరి పంటలో ఉన్న ముంపు నీటిని త్వరగా బయటకు పంపించడంతోపాటు ఎకరానికి 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్‌ను పై పాటుగా వేయాలన్నారు. వరిలో పాము పొడ ఉధృతి ఎక్కువ వచ్చే అవకాశం ఉందని, ఈ తెగులు దుబ్బు చేసే దశ నుంచి ఆకులపై మచ్చలు ఏర్పడి క్రమేణ పెద్దవిగా మారుతాయన్నారు. దాని నివారణకు ప్రొపికోనజోల్ 1మి.లీ లేదా వాలిడామైసిన్ 2 మి.లీ లేక హెక్సాకోనజోల్ 2.మి.లీ లీటరు నీటికి కలిపి దుబ్బుకు తాకేలా 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. మొక్కజొన్న పంటలో కూడా నీటిని పొలం నుంచి బయటకు పంపాలన్నారు. ఎకరానికి 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువును వేయాలన్నారు. కాండము తొలిచే పురుగు, ఆకు ఎండు తెగులు ఉధృతి ఎక్కువ గా వచ్చే అవకాశం ఉందన్నారు. దాని నివారణకు ఎకరానికి 400 మి.లీ ప్రొఫినోఫాస్, ప్రొపికోనజోల్ 200 మి.లీ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కంది పంటతో పాటు పలు రకాల పంటలకు రైతులు తగిన సూచనలు, సలహాలను పాటించాలని వారు కోరారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో వర్షాల ప్రభావంతో ప్రజానీకం వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇన్‌చార్జీ అధికారి డాక్టర్ పద్మజ కోరారు. ఆ మేరకు సోమవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల డయేరియాతో పాటు డెంగీ, మలేరియా జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ప్రజానీకం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

- కాచి చల్లార్చిన లేదా క్లోరిన్ కలిపిన నీటిని మాత్రమే తాగాలి
- భోజనానికి ముందు, మల విసర్జన తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలి
- ఈగలు వాలిన, చెడిపోయిన, నిల్వ ఉన్న ఆహార పదార్థాలు, పానీయాలు తీసుకోరాదు.
- పాడైన, చెడిపోయిన కూరగాయలు, పండ్లు, చేపలు, మాంసం తినరాదు
- మల విసర్జనకు తప్పనిసరిగా వ్యక్తిగత లేదా సామాజిక మరుగుదొడ్లు మాత్రమే వినియోగించాలి
- బహిరంగ ప్రదేశాల్లో చెడిపోయిన ఆహార పదార్థాలు కానీ, చెత్తాచెదారాన్ని వేయరాదు.
- అప్పుడే వండిన పదార్థాలను, తాజా ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి.
- ఇంటి లోపల, బయట పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- ఎవరైనా అనారోగ్యానికి గురైతే సమీపంలోని వైద్యారోగ్య సిబ్బందిని, ప్రాథమిక లేదా పట్టణ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి వెంటనే వైద్య సహాయం పొందాలని పద్మజ కోరారు.

జనసేనలో గ్రూపుల గొడవలు

- అధినేత జన్మదిన వేడుకల్లో బహిర్గతం
- పోటాపోటీ కార్యక్రమాలతో
- ఇబ్బందిపడ్డ టీడీపీ నేతలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీలో విభేదాలు బహిర్గతమయ్యాయి. అంతర్గతంగా ఉన్న వర్గపోరు బట్టబయలైంది. సాక్షాత్తూ ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకల్లోనే అవి వెలుగుచూడటం విశేషం. దీంతో వేడుకలకు హాజరైన టీడీపీ ప్రజాప్రతినిధులు, నేతలు ఇబ్బందిపడాల్సిన పరిస్థితి కూడా ఎదురైంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంలో టీడీపీ తర్వాత జనసేన పార్టీ కీలకపాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఆ పార్టీలో కూడా నాయకుల మధ్య ఆధిపత్య పోరు ఆరంభమైంది. ఇప్పటివరకు అంతర్గతంగా ఉన్న ఆ పోరు సోమవారం బట్టబయలైంది. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఉన్న రియాజ్ అనుకూల, వ్యతిరేక నేతలు ఒంగోలులో బహిరంగంగా పోటీపడ్డారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న ఆమంచి స్వాములు సొంత నియోజకవర్గమైన చీరాలలో జనసేన నేతలు మూడు గ్రూపులుగా విడిపోయారు. మార్కాపురం, పొదిలి ప్రాంతాలలో ఇదే తంతు సాగింది. జనసేనలో ఆరంభం నుంచి ఉన్నవారు ఒకవైపు, మధ్యలో వచ్చిన వారు ఇంకోవైపు ఇటీవల చేరిన వారు మరోవైపుగా నాయకులు విడిపోయి కార్యక్రమాలు చేయటం విశేషం. ఒంగోలులో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలకు ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తోపాటు అధికారపార్టీ ముఖ్యులంతా హాజరయ్యారు. మరోవైపు జనసేన ప్రచార కమిటీ జిల్లా కోఆర్డినేటర్ జడ బాలనాగేందర్ ఆధ్వర్యంలో కాపు కళ్యాణమండపంలో కార్యక్రమం జరిగింది. ఎంపీ, ఎమ్మెల్యేలను కూడా ఆయన ఆహ్వానించారు. అయితే గ్రూపుల మధ్య నెలకొన్న పోటీతో అన్ని కార్యక్రమాలకు వెళ్లాలా వద్దా అన్న అంశంపై టీడీపీ నేతలు ఇబ్బందులు పడ్డారు. చివరికి మాగుంట, దామచర్లలు రియాజ్ కార్యక్రమాలకు హాజరై బాలనాగేంద్ర కార్యక్రమాలకు గైర్హాజరయ్యారు. వారి తరపున మేయరు, కార్పొరేటర్లను పంపారు.

మార్కాపురంలో..

మార్కాపురంలో జనసేన నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయి పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్ ఆధ్వర్యంలో ఒకవైపు కార్యక్రమాలు జరగ్గా ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాధిక్ ఆధ్వర్యంలో మరోవైపు కార్యక్రమాలు జరిగాయి. టీడీపీకి చెందిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి తెలివిగా రెండు కార్యక్రమాలకు హాజరయ్యారు. అయితే ఇదే నియోజకవర్గంలోని పొదిలిలో మూడు గ్రూపులుగా నాయకులు మూడు వేర్వేరు కార్యక్రమాలు చేయటం విశేషం. జనసేనలో ఆరంభం నుంచి ఉన్న సీనియర్ నాయకులు, లీగల్‌సెల్ అధ్యక్షుడు వరికూటి నాగరాజు ఆధ్వర్యంలో ఒకవైపు కార్యక్రమాలు జరిగాయి. పొదిలి పట్టణ నాయకుడు జహీర్ ఆధ్వర్యంలో మరోవైపు కార్యక్రమాలు జరిగాయి. నిన్నమొన్నటి వరకు వైసీపీలో ఉండి భూవివాదాల్లో చిక్కుకున్న శ్రావణి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మరో కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాశీనాథ్ మాత్రం శ్రావణి వెంకటేశ్వర్లు కార్యక్రమానికి మాత్రమే హాజరయ్యారు.

చీరాలలో..

అలాగే చీరాలలోను నాయకులు మూడు గ్రూపులుగా నాయకులు వేర్వేరు కార్యక్రమాలు నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు ఆధ్వర్యంలో కొన్ని కార్యక్రమాలు జరిగాయి. ఆ పార్టీ రీజనల్ ప్రోగ్రామ్ కమిటీ కన్వీనర్ అనిల్ ఆధ్వర్యంలో మరికొన్ని కార్యక్రమాలు జరిగాయి. ఈ ఇద్దరు నాయకులతో సంబంధం లేకుండా ఆరంభం నుంచి జనసేనలో ఉన్న వారు ప్రత్యేకంగా వేడుకలు నిర్వహించారు. ఇదేరకంగా ఉమ్మడి జిల్లాలోని మరికొన్ని ప్రాంతాలలోను జనసేన నాయకులు గ్రూపులవారీ కార్యక్రమాలు నిర్వహించారు.

రేషన్.. పరేషాన్...!

- తాళ్లూరు మండలంలో కొలిక్కిరాని డీలర్ల నియామకం
- రెవెన్యూ ఉద్యోగుల పేరున షాపుల నిర్వహణ
- డీలర్లు రాజీనామాలు సమర్పించినా కొత్త వారి నియామకంలో జాప్యం
- మూడు నెలలుగా అవస్థలుపడుతున్న ఉద్యోగులు
- బదిలీల కాలం కావడంతో మరింత ఇబ్బందులు

తాళ్లూరు, సెప్టెంబరు 2 : మండలంలో రేషన్ వ్యవస్థ నిర్వహణకు చిక్కులు ఎదురవుతున్నాయి. రాజీనామా చేసిన డీలర్ల స్థానంలో కొత్తవారిని నియమించకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ అస్తవ్యస్త విధానంతో అటు ప్రజలు, ఇటు ఉద్యోగులు సతమతమవుతున్నారు. మండలంలో మొత్తం 32 రేషన్ షాపులు ఉండగా, అందులో 13 మంది డీలర్లు రాజీనామాలు చేశారు. వారు రాజీనామాలు సమర్పించి ఇంచుమించు మూడు నెలలు దాటుతున్నా కొత్త వారి నియామకం ఓ కొలిక్కిరాలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొందరు డీలర్లు తమ రాజీనామాలను అధికారులకు సమర్పించారు. ఆ వెంటనే అధికారులు ఆ గ్రామ వీఆర్వో, వీఆర్ఏల పేర్ల మీదకు రేషన్ షాపలను మార్చారు. మూడునెలలుగా రేషన్‌షాపులు రెవెన్యూ ఉద్యోగుల పేర్ల మీదే కొనసాగుతున్నాయి. రాజీనామాలు చేసిన డీలర్ల స్థానంలో కొత్తవారిని నియమించాలని తహసీల్దార్ కార్యాలయంలో దాదాపు మూడు నెలల క్రితం దరఖాస్తులను అందజేశారు. వారి రాజీనామాలను ఆమోదించిన తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నూతన డీలర్ల నియామకం కోసం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో 13 రేషన్ షాపులు ఆగ్రామాలకు చెందిన రెవెన్యూ ఉద్యోగుల పేరున కొనసాగుతుండటంతో రేషన్ పంపిణీ కష్టతరంగా ఉంది.



అటు ఉద్యోగ బాధ్యతలు, ఇటు పంపిణీ పర్యవేక్షణ

రెవెన్యూ ఉద్యోగులకు డీలర్ల షాపులను అదనంగా అప్పగించటంతో నిత్యం రైతులకు, ప్రజలకు సర్వీస్ చేయటం కష్టంగా ఉంది. గ్రామాల్లో తాత్కాలికంగా రేషన్ షాపులను నిర్వహిస్తున్న డీలర్లు రేషన్ పంపిణీ కోసం పంపిణీ మిషన్‌లో రెవెన్యూ ఉద్యోగుల వేలి ముద్ర తీసుకోవాల్సి ఉంది. దీంతో రెవెన్యూ ఉద్యోగులు కార్యాలయాలను విడిచి రేషన్‌షాపుల వద్దకు వెళ్లాల్సి ఉంది. రేషన్ పంపిణీ జరుగుతున్న సమయంలో సర్వర్ సేవలు అకస్మాత్తుగా నిలిచిపోతే మళ్లీ రెవెన్యూ ఉద్యోగి ఆ డీలర్ షాపు వద్దకు పరుగుతీయాల్సి వస్తుంది. ఇదిలా వుండగా షాపులోని రేషన్ పక్క దారి పడితే ఉన్నతాధికారులు తమల్ని బాధ్యులను చేస్తారని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం రెవెన్యూ ఉద్యోగులు బదిలీల కోసం ప్రయత్నాలు చేస్తూ అందుబాటులో ఉండటం లేదు. దీంతోషాపు నిర్వహించేందుకు కష్టంగా ఉంది. రెవెన్యూ అధికారులు కూడా డీలర్ల నియామకంలో మూడు నెలలుగా పట్టించుకోపోవటంలోని అంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రేషన్ డీలర్ల నియామకాన్ని వేగవంతం చేసి కార్డుదారులకు కష్టాలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

లాభాలు కురిపిస్తున్న మల్లె సాగు

కలిసివచ్చిన శుభకార్యాలు, పండుగల సీజన్

అద్దంకి, సెప్టెంబరు 2 : మల్లె సాగు రైతులకు ఈ ఏడాది శుభకార్యాలు, పండుగల సీజన్ కలిసి వచ్చింది. దీంతో అనుకోకుండా ధరలు పెరగడంతో లాభాలు కురిపించింది. ఇటీవల వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ముందు రోజు కిలో రూ.700 వరకు పలికింది. అదే సమయంలో ఈ ఏడాది మూఢం కారణంగా లగ్నాలు లేవు అనుకున్న తరుణంలో శ్రావణమాసంలో ముహూర్తాలు ఉండటం కూడా కలిసి వచ్చింది. దీంతో కనీస ధర కిలో రూ.100 నుంచి రూ.150 వరకు ఉంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అద్దంకి మండలం ధేనువకొండ, పేరాయపాలెం, కొరిశపాడు మండలం తమ్మవరం, మద్దిపాడు మండలం గుళ్ళాపల్లి, వెల్లంపల్లి, కొలచనకోట, తాళ్ళూరు మండలం రజానగరం తదితర గ్రామాలలో సుమారు 300 ఎకరాలలో మల్లె సాగు చేస్తున్నారు. స్థానికంగా అమ్మకాలతో పాటు విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాలకు కూడా ఎగుమతి చేస్తుంటారు. ఏటా ఒడిదొడుకులతో సాగే మల్లె సాగు ఈ ఏడాది కాలం కలసిరావడం, వర్షాలు తక్కువగా ఉండి ఎండలు ఎక్కువగా ఉండడంతో దిగుబడి ఆశాజనకంగా ఉంది. కొన్ని పొలాలలో మాత్రం కొద్దిమేర దిగుబడి తగ్గింది. ధర ఆశాజనకంగా ఉండడం, దిగుబడి కూడా పెరగడంతో మల్లె రైతులు పరిస్థితి ఆశాజనకంగా మారింది. సాధారణంగా ఏటా మల్లె సాగుకు ఎకరాకు 5 లక్షల రూపాయల వరకు వస్తుండగా, ఈ ఏడాది మాత్రం అదనంగా మరో లక్ష రూపాయల వరకు వచ్చే అవకాశం ఉంది. ఎకరా కౌలు 60 నుంచి 70 వేల రూపాయల వరకు ఉండగా, కూలీలు, ఎరువులు, కూలీల ఖర్చు మరో 2 లక్షల రూపాయల వరకు ఉంటుంది. అన్ని ఖర్చులు పోను ఎకరాకు 2 నుంచి 3 లక్షల రూపాయల వరకు మిగేలే అవకాశం ఉంది. అయితే మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షాలు మల్లె రైతులను ఒకింత ఆందోళన కలిగిస్తుంది. ఈ ఏడాది మల్లె సాగు ఆశాజనకంగా ఉండటంతో వచ్చే ఏడాది సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది.


ధేనువకొండ వద్ద సాగులో ఉన్న మల్లె తోటలు

ఆశాజనకంగా ఉంది



మల్లె సాగు ఈ ఏడాది ఆశాజనకంగా ఉంది. శ్రావణమాసం పెళ్లిళ్లతో పాటు, పండుగలు కూడా కలిసి రావడంతో ధరలు బాగా ఉన్నాయి. ఇటీవల వరకు ఎండలు ఉండడంతో దిగుబడులు కూడా పర్వాలేదు. గతం కన్నా ఈ ఏడాది మల్లె సాగు లాభదాయకంగానే ఉంది. ధరలలో ఒడిదొడుకులు లేకపోవడంతో ఆదాయం కూడా బాగానే ఉంది.

- గోరంట్ల వెంకటరావు,
రైతు, ధేనువకొండ, అద్దంకి మండలం


ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి

ఆంజనేయస్వామికి అరటి పండ్ల పూజ

అద్దంకి, సెప్టెంబరు 2 : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం లో అమవాస్య సందర్భంగా సోమవారం అరటి పండ్లతో పూజను వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, గోపూజ, బిందెతీర్థం, అభిషేకం నిర్వహించారు. అనంతరం 11 ఆవృత్తములుగా వేదపండితులు, అర్చకులు అరటిపండ్లతో పూజ నిర్వహించారు. ఉభయదాతలుగా ఒంగోలుకు చెందిన నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ అధినేత శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. ఏర్పాట్లను ఈవో, సహాయ కమిషనర్ సుభద్ర పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.


రాచపూడి చెరువును పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ చిన్నబాబు

నీళ్లు ఇస్తాం.. చెరువు నింపుకోండి

గ్రామస్థులకు ఇరిగేషన్ ఈఈ

మేదరమెట్ల, సెప్టెంబరు 2 : గుండ్లకమ్మ రిజర్వాయర్ ఎడమ కాలువకు నీటిని వదులుతాం, చెరువులను నింపుకోవాలని ఇరిగేషన్ ఈఈ చిన్నబాబు గ్రామస్థులకు తెలిపారు. విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు సోమవారం రాచపూడి చెరువును ఆయన అధికారులు, గ్రామస్థులతో కలిసి పరిశీలించారు. రాచపూడిలో బావులు అడుగుఅంటి తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది అని, చేరువులు పూర్తిగా ఎండిపోయాయని ఇటీవల గ్రామస్థులు మంత్రి రవికుమార్‌కు తెలిపారు. దీనిపై ఆయ స్పందిస్తూ ఇరిగేషన్ అధికారులకు రాచపూడి వెళ్లి పరిశీలించి చెరువును నింపడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులు చెరువును పరిశీలించి చెరువును నింపుకోవడానికి నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మోటార్లు ఉపయోగించి చెరువులను నింపుకోవాలన్నారు. 2011లో ఎడమకాలువ నీటితో చెరువు నింపుకోవడానికి పంపు హౌస్‌లు నిర్మించారు. విద్యుత్ లైన్లు కూడా ఏర్పాటు చేశారు. మోటార్లు బిగించకపోడంతో పంపు హౌస్ నిరుపయోగంగా మారింది. చిన్నబాబు దృష్టికి పంపుహౌస్ విషయం తీసుకువెళ్లగా పంపు హౌస్‌ను పరిశీలించి మోటార్లను ఏర్పాటు చేయాలని అధికారులు సూచించారు. మంగళవారం ఎడమ కాలువ నుంచి మోటార్లతో నీటిని ఎత్తిపోసి చెరువు నింపు కోవడానికి గ్రామస్థులు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఈ రవి, ఏఈ శ్రీనివాసులు, గ్రామ నాయకులు జాగర్లమూడి సుబ్బారావు పాల్గొన్నారు.

సెకండరీ గ్రేడ్ టీచర్ల సర్దుబాటుపై కౌన్సెలింగ్


మాట్లాడుతున్న ఎంఈవో సుధాకరరావు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 2 : సెకండరీ గ్రేట్ టీచర్ల పని సర్దుబాటు కౌన్సెలింగ్ సోమవారం ఎమ్మార్సీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మండలంలో అదనంగా ఉన్న 33 మంది టీచర్లకు అవసరమైన ఐదుగురు టీచర్స్‌ను సర్దుబాటు చేసినట్లు ఎంఈవోలు గంగాధరావు, బి. సుధాకరరావు తెలిపారు. ఇప్పటికే స్కూల్ అసిస్టెంట్ పోస్టుల పని సర్దుబాటు పూర్తయిందని, వారిలో 17 మందికి కొత్తగా ఇతర ప్రాంతాలలో సర్దుబాటు చేసినట్లు చెప్పారు. వీరందరికీ త్వరలో ఆర్డర్లు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసమూర్తి, టీచర్స్ యూనియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'నీ గానమే నాప్రాణం' జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ప్రతినిధులు

చీరాలటౌన్, సెప్టెంబరు 2 : చీరాల పట్టణంలో బుధవారం నిర్వహించనున్న అయ్యప్ప 42వ నీగానమే నాప్రాణం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అఖిల భారత చీరాల అయ్యప్ప దీక్షాప్రచార సమితి ప్రతినిధులు కోరారు. ఇందుకు సంబంధించి వేదికను సోమవారం రాష్ట్ర కార్యదర్శి వాసు గురుస్వామి, సాంస్కృతిక ప్రచార కార్యదర్శి లక్ష్మణారెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏపీతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందిన గురుస్వాములు, గాయకులు, అయ్యప్ప స్వాములు కార్యక్రమానికి హాజరవుతున్నట్లు వివరించారు. బుధవారం ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఆధ్యాత్మిక భక్తి గీతాలాపన జరుగుతుందని చెప్పారు. కార్యక్రమానికి వేలాదిగా భక్తులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

వాడరేవు నుంచి విజయవాడకు ఐదు బోట్లు


బోటును లారీలోకి ఎక్కిస్తున్న మత్స్యకారులు

చీరాల, సెప్టెంబరు 2 : వరదలతో ఇబ్బంది పడుతున్న విజయవాడ ప్రజలకు సాయం అందించేందుకు ఎక్కడికక్కడ బోట్లు అవసరమవుతున్న నేపథ్యంలో టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ చొరవతో ఐదు బోట్లు సోమవారం విజయవాడ పంపించారు. వాడరేవుకు చెందిన టీడీపీ నేత పిక్కి నారాయణ, మత్స్యకారులు అందుకు సహకరించారు. ఎక్స్‌కవేటర్ సాయంతో ఐదు బోట్లను లారీలకు ఎక్కించారు. ఎన్ని రోజుల అవసరమైతే అన్ని రోజులు బోట్లు అక్కడ ఉంటాయని వారు తెలిపారు.

పంటలు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


వర్షానికి దెబ్బతిన్న పైర్లను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు, రైతులు

చీరాల, సెప్టెంబరు 2 : వర్షాలు కురిసిన నేపథ్యంలో చేలల్లో పంటల్లో ఎక్కువగా నష్టపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బాపట్ల వ్యవసాయ రీసెర్చ్ స్టేషన్, ఏరువాక కేంద్రం అధికారులు చెప్పారు. వర్షాలకు చీరాల, వేటపాలెం మండలాల పరిధిలో బుర్లవారిపాలెం, పిట్టువారిపాలెం, వాడరేవు, పాపాయిపాలెం గ్రామాల పరిధిలో మినుము, వేరుశనగ సాగు చేసిన పొలాలను పరిశీలించారు. అందులో పీకుడుకు వచ్చిన మినుము మొలకెత్తకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. అలానే మరో వారం రోజులలో పీకుడుకు వచ్చే వేరుశనగను పీకి మెరక ప్రాంతాల్లో ఉంచి మొలకెత్తకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ మురళి, ఆర్.బాల మురళీధర్‌నాయక్, రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త డాక్టర్ బి. కృష్ణవేణి రైతుల సందేహాలను నివృత్తి చేవారు. ప్రాథమికంగా చీరాల మండలంలో 100 ఎకరాలు మినుము, 50 ఎకరాల్లో వేరుశనగ, వరి నారుమళ్లు 100 ఎకరాల్లో, ఎండుగడ్డి 100 ఎకరాల్లో నీటమునిగినట్లు ఏవో సుమతి తెలిపారు. ఆయా కార్యక్రమాలలో పలువురు టీడీపీ నాయకులు కౌతవరపు జనార్ధనరావు, జంగిలి రామారావు, బుర్ల వెంకటేష్, గుమ్మ వెంకటేష్, పిక్కి నారాయణ, డేటా నాగేశ్వరరావు, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మార్టూరు : మండలంలో రాజుపాలెం, బొబ్బేపల్లి గ్రామాలలోని పత్తి, మొక్కజొన్న, మినుమును సోమవారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. మార్టూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు పొలాల్లోకి వెళ్లి పంటల రైతులో మాట్లాడారు. పొలాల్లో నిలబడిన వర్షపు నీటిని బయటకు వెళ్లేలా చూడాలన్నారు. పంటలు దెబ్బతినకుండా ఉండేందుకు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ పాల్గొన్నారు. అలాగే ఉద్యాన అధికారి బీ హనుమంతనాయక్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. అందులో భాగంగా నాగరాజుపల్లి గ్రామంలో మిరప, కూరగాయలపంటలను పరిశీలించారు.

అద్దంకిటౌన్ : మొక్క జొన్న పొలాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని శింగరకొండపాలెం, ఉత్తర అద్దంకి ప్రాంతాలల్లో సాగులో ఉన్న మొక్కజొన్నను ఆయన పరిశీలించారు. ఎకరాకు 25 కిలోల నత్రజని, 10 కిలోల పొటాష్ కలిపి చల్లుకోవాలన్నారు. వరి పంటలోను నీటిని బయటకు పంపి 30 కిలోల యూరియా, 15 కిలోల ఎంవోపిని వేయాలన్నారు. ఆయనవెంట ఏఈవో కోటేశ్వరరావు, వ్యవసాయ సహాయకుడు సాయిబాబు, రైతులు ఉన్నారు.

బల్లికురవ : పత్తి పొలాలలోని వాన నీటిని బయటకు పంపించాలని మండల వ్యవసాయాధికారి కుమారి అన్నారు. ఉప్పుమాగులూరులో పత్తిపొలాలను ఏవో కుమారి సోమవారం పరిశీలించారు. ప్రస్తుత వర్షాలతో పత్తికి మేలు కలుగుతుందన్నారు. అధిక తేమ తగ్గించుకోవడానికి ఎకరాకు 25 నుంచి 30 కిలోల యూరియా, 15 కిలోల పోటాష్ వేసుకోవాలన్నారు. పత్తి పూత దశలో ఉండడంతో గులాబీ పురుగు రావడానికి అవకాశం ఉందన్నారు. లింగాకర్షక బుట్టలు ఎకరాలు 5 లేదా 6 ఏర్పాటు చేసుకోవాలన్నారు. 5 శాతం వేప గింజల కషాయం పిచికారీ చేసుకోవాలన్నారు.


కూరగాయలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి


పత్తిని పరిశీలిస్తున్న ఏవో కుమారి

ఘనంగా పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు

చీరాలలో రక్తదానం

చీరాల, సెప్టెంబరు 2 : డిప్యూటీ సీఎం, సినీ హీరో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం చీరాలలోని రోటరీ కమ్యూనిటీ హాలులో ఘనంగా నిర్వహించారు. జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏరియా వైద్యశాల బ్లడ్ బ్యాంక్ వారి పర్యవేక్షణలో రక్తదానం చేశారు. పవన్ ఆదర్శాలను అనుగుణంగా ముందుకు సాగుతామన్నారు. రక్తదానం మరొకరికి ప్రాణ దానంతో సమానమే సూక్తి అనుసరించి రక్త దాన శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. వర్ష బాధితులకు తమవంతు సహకారం అందించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతామన్నారు. ముందుగా కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గూడూరి శివరామప్రసాద్, మామిడాల శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కౌతవరపు జనార్ధనరావు, ఎంఆర్ఎఫ్ రమేష్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీరమహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు ఆధ్వర్యంలో గడియార స్తంభం సెంటర్లో కేక్ చేశారు. మండల పరిధిలోని తోటవారిపాలెంలో కేక్ కటింగ్, జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర ప్రోగామ్ కమిటీ కన్వీనర్ అలా అనిల్ ఆధ్వర్యంలో వైకుంఠపురం, వేపాలెం మండలం పందిళ్లపల్లిలో కేక్ కటింగ్ చేసి మొక్కలు నాటారు.

పర్చూరు : జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మండలంలోని పలు గ్రామాల్లో కేకలు కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రవాశాంధ్రుడు, జనసేన పార్టీ పర్చూరు నియోజకవర్గ నాయకుడు మన్నెం శ్రీకాంత్ ఆర్థిక సాయంతో అన్నదానం, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కారంపూడి సందీప్ తేజ, మణి, తులసి చంటి, సురేంద్రబాబు, ఆంజనేయులు పాల్గొన్నారు.


చీరాలలో రక్తదానం చేస్తున్న కూటమి నాయకులు

బాలికల పాఠశాలలో రక్తదాన శిబిరంలో 51 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అద్దంకి : ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం అద్దంకి నియోజకవర్గ జనసేన నేతలు పలు కార్య క్రమాలు నిర్వహించారు. జనసేన పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జనసేన సెంట్రల్ ఆంధ్రా జోన్ కమిటీ మెంబర్ గోరంట్ల సాయి, అద్దంకిటౌన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉమ్మడి ప్రకాశం జిల్లా సంయుక్త కార్యదర్శి కృష్ణ, వెంకటేష్, వెంక ట్రావు, వీరాంజి, హరీష్, వీరాచారి, మణి, కృష్ణ, చిరంజీవి, దుర్గ, సాయి, శ్రీరామ్, చం ద్ర, చరణ్, మురళీ, రామారావు, రాము, సుభాని పాల్గొన్నారు.

పంగులూరు : మండలంలోని ప లు గ్రామాలలో పవన్ కల్యాన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో సో మవారం ముప్పవరంలోని వసతి గృహ బాలబాలికలు, సిబ్బందికి స్వీట్లు, దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాంబాబు, సుందరశెట్టి ఫణీంద్ర, టీడీపీ నాయకుడు ఇంటూరి పూర్ణయ్య, శ్రీనివాసరావు, స్వామి పాల్గొన్నారు. తక్కెళ్లపాడులో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత పిచ్చిరెడ్డి, జనసేన పార్టీ నాయకులు బ్రహ్మయ్య, శ్రీను పాల్గొన్నారు.

యద్దనపూడి, (మార్టూరు) : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలను సోమవారం మండలంలో జనసేన పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. యద్దనపూడి మండ లం పూనూరులో టీడీపీ, జనసేన కార్యకర్తలు ప్రధాన సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. మిగిలిన గ్రామాలలోని పవన్ కల్యాణ్ అభిమానులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. పడమర బజారున అభిమానులు కేక్ కట్ చేసి పాటకచేరీని ఏర్పాటు చేశారు. రాజుగారిపాలెంకు చెందిన అభిమానులు స్థానికంగా వెంకయ్య ఆశ్రమంలో వృద్ధులకు పేదలకు అన్నదానం ఏర్పాటుచేశారు. తాటివారిపాలెం, వలపర్ల, బొబ్బేపల్లి, నాగరాజుపల్లి, రాజుగారిపాలెం గ్రా మాల్లో వేడుకలు నిర్వహించారు.

చినగంజాం : జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పూలవారిపాలెం గ్రామంలో, సోపిరాల రైల్వేగేటు సెంటర్‌లో, కడవకుదురులో పార్టీ కార్యాలయం వద్ద కూటమి నాయకులు, పవన్ అభిమానులు కేకు కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు టి.జయరావు, సందు శ్రీనివాసరావు, చెరుకూరి రాఘవయ్య, ఏసుబాబు, కోటయ్య, నరహరి శ్రీనివాసరావు, శ్రీరా మ్, పార్థసారథి, లక్ష్మీనారాయణ, ఏసునారాయణ, వెంకటనారాయణ, జనసేన పార్టీ మండల నాయకుడు శ్రీనివాసరావు, గ్రామ పెద్ద సీతారామయ్య పాల్గొన్నారు.


కేక్ కట్‌చేస్తున్న జనసేన నేతలు


కేక్ కట్ చేస్తున్న జనసేన, టీడీపీ నాయకులు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సభ్యులు

4న ఉపాధ్యాయులకు పురస్కారాలు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 2 : గురుపూజోత్సవం సందర్భంగా ఈ నెల 4వ తేదీన అద్దంకిలోని మారంవారి సేవా సదన్‌లో విద్యారంగంలో విశేష కృషి చేస్తున్న ఉపాధ్యాయలకు పురస్కారాలను పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. సోమవారం పురస్కారాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. మండలంలోని పని చేస్తున్న 5గురు ఉపాధాయులకు పురస్కారాలను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వారణాసి రఘురామశర్మ, సిహెచ్ మురళి సుధాకరరావు, చప్పిడి వీరయ్య, ఎల్. శ్రీనివాసరావు, మహమ్మద్ రఫీ, ఎం.శ్రీనివాసరావు, అద్దంకి లేవి ప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


రక్తదాతలను అభినందిస్తున్న క్లబ్‌ల ప్రతినిధులు

చీరాల, సెప్టెంబరు2 : ఎస్‌వీఎస్ అండ్ ఎస్‌జేఆర్ కల్యాణ మండపంలో ఆదివారం వాసవీ, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష్ స్పందన లభించింది. ప్రజ్ఞా హాస్పటల్ వైద్యులు డాక్టర్ పీవీ శ్రీనివాస్, డాక్టర్ మంజూవాణి గుండె, ఇతర సాధారణ వ్యాధులకు సంబంధించి 250 మంది రోగులను పరిక్షించి, ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం వాసవీ క్లబ్ ఇంటర్నేషన్ ఫౌండర్ కేసీ గుప్తా జయంతి సందర్భంగా రైట్ హాస్పటల్ వారి ఆధ్వర్యంలో 19 మంది రక్తదానం చేశారు. మున్సిపల్ కార్యాలయంకు 40 లీటర్ల వాటర్ కూలర్‌ను అందజేశారు. వైకుంఠపురంలోని చైతన్య మనో వికాస కేంద్రానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పేర్ల వెంకట సత్యన్నారాయణ, వి.బి.వి సత్యన్నారాయణ, క్లబ్ అధ్యక్షులు వల్లంపట్ల వెంకటేశ్వరరావు, వనిత అధ్యక్షురాలు దేవిశెట్టి సుకన్య, ఇతర ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

వరి సాగుకు నీరివ్వండి

పంగులూరు, సెప్టెంబరు 2 : వరి సాగుకు నీటి విడుదలపై సానుకూల ప్రకటన చేయాలని రైతు సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాగర్ జలాలను వరిసాగుకు అందించాలని, కాలువలకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీటీ ఆదినారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, సుబ్బారావు, సాహెబ్, మల్లారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన కల్పించండి


కరపత్రాలను పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 2: గ్రామ స్థాయిలో మహిళలకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తి, నియంత్రణపై అవగాహన కల్పించాలని ఏపీఎం కోటేశ్వరరావు అన్నారు. సోమవారం వెలుగు కార్యాలయంలో వీవోలు, యానిమేటర్లకు జరిగిన సమావేశంలో హెల్ప్ హెచ్‌ఐవీ స్వచ్ఛంద సంస్థ, జిల్లా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మీకు తెలుసా ఐఈసీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నెంబరు 1097పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీలు సురేష్, ఏసయ్య, సభ్యులు కరుణశ్రావణి, మల్లేశ్వరి, శివపార్వతి, పార్వతి పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

చీరాలటౌన్, సెప్టెంబరు 2 : ఆటో బోల్తాపడడంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన సోమవారం చీరాల ఏరియా హాస్పిటల్ ప్రాంగణంలో చోటుచేసుకుంది. బాధితుడు మరికొందరు బంధువుల హాస్పిటల్ చికిత్స పొందుతున్న బంధువులను పరామర్శించేందుకు వచ్చారు. తిరిగి డ్రైవర్ బయటకు వెళుతుండగా మలుపు రోడ్డు వద్ద ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న డ్రైవర్‌కు రక్త గాయాలయ్యాయి.

ఒంటరి మహిళపై పలువురు దాడి

చీరాలటౌన్, సెప్టెంబరు 2 : ఒంటరి మహిళపై ముగ్గురు తీవ్రంగా దాడి చేసి గాయపరిచారు. ఈఘటన చీరాల మండలం బోయినవారి పాలెంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయిన పద్మ, కోటి మోహన్, సుబ్బారావు, బోయిన గోపికి మధ్య పాత కక్షలున్నాయి. ఈక్రమంలోనే గతంలోనే ఈమెపై దాడికి పాల్పడ్డారు. దీనిపై కేసులు నడుస్తున్నాయి. సోమవారం కూడా పచ్చడి బండతో ముఖం మీద దాడిచేసి గాయపరిచారు. అపస్మారక స్థితిలోన ఉన్న పద్మను కుమార్తె శివలీల ఏరియా హాస్పిటల్‌కు తరలించగా, మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల్లో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. సుబ్బారావు కోసం గాలిస్తున్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

చీరాల, సెప్టెంబరు 2 : ఏరియా వైద్యశాలలో సోమవారం వైఎస్ఆర్ వర్థంతి సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అంతకముందు గడియార స్తంభం సెంటర్‌లోని వైఎస్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్టూరు : బొమ్మల సెంటర్‌లో వైఎస్ విగ్రహానికి నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగొర్ల శివ శ్రీలక్ష్మీ జ్యోతి, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చినగంజాం : చినగంజాం మార్కెట్ సెంటర్‌లో, మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అడవీధిపాలెం గ్రామంలోని వైఎస్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అద్దంకి : మాజీ సీఎం వైఎస్ వర్థంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని 20వ వార్డులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాణెం చినహనిమిరెడ్డి, అద్దంకి పట్టణ పార్టీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, కౌన్సిలర్‌లు గుంజి కోటేశ్వరరావు, బాలు, జబ్బార్, వైసీపీ నేతలు బీవీ కృష్ణారెడ్డి, ఉడత్ సురేష్ పాల్గొన్నారు.


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ జంజనం